

జిల్లాలో వర్షపాతం ఇలా..

అమలాపురం టౌన్, జూలై 9: జిల్లాలో మంగళవారం సగటున 5.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మండలాల వారీగా... సఖినేటిపల్లి 15.8, మండపేట, అయినవిల్లి 0.4, ఆత్రేయపురం 2.4, రాయవరం 0.8, రామచంద్రపురం 1.2, ఆలమూరు 2, రావులపాలెం 2.8, కొత్తపేట 6.8, కపిలేశ్వరపురం 8.2, కె.గంగవరం 4.8, ఐ.పోలవరం 5.6, ముమ్మిడివరం 10.2, పి.గన్నవరం 3.4, అంబాజీపేట 4.2, మామిడికుదురు 10.4, రాజోలు 8.4, మలికిపురం 12.6, అల్లవరం 2.8, అమలాపురం 1.6, ఉప్పలగుప్తం 2.6, కాట్రేనికోన 8.4.

కోట్లు మింగేసిన.. ఘనులు!



సీనరేజీలో కోట్లు పిండేసి..బాకీ కాదనేసి..

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

వడ్డింవాడు మనవాడైతే అడ్డేముంటుంది.. దోచుకోవచ్చు.. దాచుకోవచ్చు.. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు చాలా మంది పెద్దలు చేసిందిదే..ప్రస్తుతం అధికారం మారడంతో ఒక్కొక్కరి బాగోతం బయటపడుతోంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఆ కంపెనీ మొన్నటి వరకు క్వారీల నుంచి కాసులు పంట పండించుకుంది. లేటరైట్, గనులు, గ్రావెల్ తవ్వకాల నుంచి ముక్కుపిండి సీనరేజీ పేరుతో కోట్లకు కోట్లు దండేసుకుంది. ప్రభుత్వం తరఫున గనుల శాఖ చేయాల్సిన పనని జగన్ ప్రభుత్వం ఏకంగా ఆ కంపెనీకి అడ్డగోలుగా గతేడాది ఏప్రిల్‌లో కట్టబెట్టేసింది. నువ్వు ఎన్ని కోట్లయినా పిండుకో..ప్రభుత్వానికి నెలకు కేవలం రూ.9.70 కోట్లు కడితే చాలంటూ బంపర్ ఆఫర్ ఇచ్చేసింది. ఇంకేం..అప్పట్లో ఓ అధికార పార్టీ నేత అండదండలతో ఆ కంపెనీ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో రెచ్చిపోయింది. క్వారీలు, గుట్టలు, లేటరైట్, గనుల నుంచి వెళ్లే ప్రతిలారీ నుంచి సీనరేజీ పిండేసింది. నెలకు ప్రభుత్వానికి కట్టాల్సిన దానికంటే రెట్టింపు సొమ్మును చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి మరీ ముక్కుపిండి రాబట్టింది. తీరా ఇటీవల ప్రభుత్వం మారడంతో ఆ కంపెనీ దందాకు చెక్‌పడింది. కానీ ప్రభుత్వానికి కట్టాల్సి ఉన్న సీనరేజీ డబ్బులు మాత్రం ఇప్పటికీ కట్టకుండా డ్రామాలాడుతోంది. అప్పట్లో తన అనుయాయ కంపెనీకి జగన్ సర్కారు రూ.20 కోట్ల వరకు గుట్టుగా సీనరేజీ రద్దు చేయడాన్ని సాకుగా చూపుతోంది. ఆ రద్దు వల్ల తనకు రాబడి పడిపోవడంతో కట్టాల్సిన బాకీ నుంచి మినహాయింపు కోరుతోంది. ఎన్నికలకు ముందు అధికార పార్టీ పెద్దల ద్వారా రాయబారం నడిపింది. ఈలోపు కొత్త ప్రభుత్వం రావడంతో ఏం చేయాలో తెలీక అధికారుల ద్వారా ఒత్తిడి తెచ్చేందుకు డ్రామా మొదలుపెట్టింది.

జగన్ సారూ.. ఉన్నారు?

గత జగన్ ప్రభుత్వంలో పాలన అంతా నిబంధనలకు విరుద్ధంగానే నడిచింది. గనులశాఖలో అయితే ఇక చెప్పనక్కర్లేదు. అడ్డగోలు నిర్ణయాలతో ఖజానాకు కోట్లలో గండి పడింది. వ్యక్తులకు మాత్రం భారీగా ఆర్థిక లబ్ధి చేకూర్చేలా అప్పటి పాలకులు నిర్ణయాలు తీసుకున్నారు. జగన్‌కు చెందిన ఓ బినామీ కంపెనీ రౌతులపూడిలో భారీ కొండలో నల్లరాయి క్వారీ మైనింగ్‌కి అనుమతులు పొందగా దాని మైనింగ్‌కు సంబంధించి ప్రభుత్వానికి కోట్లలో సీనరేజీ కట్టాల్సి ఉంది. కానీ అప్పటి ప్రభుత్వం పూర్తిగా ఈ కంపెనీ కోసం నిబంధనలకు పాతరేసింది. ఒక్క రూపాయి కూడా సీనరేజీ గనుల శాఖకు కట్టక్కర్లేకుండా ఏకంగా మినహాయింపు ఇచ్చేసింది. తద్వారా రూ.20 కోట్ల వరకు సదరు కంపెనీకి భారీ లబ్ధి చేకూర్చిపెట్టింది. సీనరేజీ మినహాయింపు ఆదేశాలు మూడో కంటికి తెలియకుండా రహస్యం పాటించారు. ఇదంతా ఒకెత్తయితే నెలనెలా ప్రభుత్వానికి సుధాకర్ ఇన్‌ఫ్రా కట్టాల్సిన సీనరేజీ కాంట్రాక్టు డబ్బులను కొంతకొంతగా ఎగ్గొడుతూ వస్తోంది. ఇదేంటని అడిగితే జగన్ అనుయాయ కంపెనీకి రూ.20 కోట్ల వరకు సీనరేజీ మినహాయింపు ఇవ్వడంతో తన రాబడి తగ్గిపోయిందని కొన్ని నెలల కిందట కొత్త వాదన తెచ్చింది. ఈ నేపథ్యంలో రద్దు చేసిన రూ.20 కోట్ల సీనరేజీ డబ్బులో కొంత వాటా తన పాత బకాయిలకు సర్దుబాటు చేయాలంటూ కొత్త పాట పాడింది. ఈ కంపెనీ వెనుక వైసీపీ నేత ఉండడంతో కాకినాడ గనుల శాఖ ఉన్నతాధికారులు మొత్తబడ్డారు. సదరు సుధాకర్ ఇన్‌ఫ్రా నెలవారీ చెల్లించాల్సిన సీనరేజీ కాంట్రాక్టు డబ్బులు బాకీ ఉందని, ఈ బాకీలకు ఓ కంపెనీకి ప్రత్తిపాడు నియోజకవర్గంలో రద్దు చేసిన రూ.20 కోట్లకు పైగా సీనరేజీ డబ్బుల్లో కొంత మొత్తాన్ని సర్దుబాటు చేయాలంటూ లేఖ రాశారు.అయితే అప్పటికే రాష్ట్రంలో ఎన్నికల హడావుడి మొదలవడం, ఎన్నికల కోడ్ కూడా వచ్చేయడంతో గత ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకోలేదు. కానీ తాను అనుకున్న పని పూర్తి చేయించుకోవడం కోసం సుధాకర్ ఇన్‌ఫ్రా తెగ ప్రయత్నాలు చేసింది. నెలనెలా కోట్లలో రెట్టింపు రాబడి పిండేసినా కట్టాల్సిన రూ.25 కోట్ల బాకీ చెల్లించకుండా ఎగ్గొట్టే ప్రయత్నం చేసింది. ఈలోపు ఎన్నికలు జరగడం, తిరిగి వైసీపీ ప్రభుత్వం వస్తుందనే ధీమాతో సదరు కంపెనీ బాకీలు కట్టకుండా ఆగిపోయింది. ఊహించని విధంగా కూటమి ప్రభుత్వం గద్దెనెక్కడంతో సదరు కంపెనీకి నోట్లో పచ్చి వెలక్కాయ పడ్డట్లయింది. కట్టాల్సిన బాకీలు చెల్లించాల్సి రావడం, అటు ప్రభుత్వం మారడంతో సీనరేజీ వసూలు కాంట్రాక్టు నుంచి కూడా తప్పుకోవాల్సి రావడం పెద్ద షాక్‌కు గురిచేసింది. దీంతో ఇప్పుడు సీనరేజీ వసూలు ఎక్కడికక్కడ ఈ కంపెనీ చేయకుండా గనులశాఖ డీడీ కార్యాలయం చెక్‌పెట్టింది. కొత్త ప్రభుత్వంలో తన ఆటలు సాగే అవకాశం లేకపోవడంతో రూ.25కోట్లు ఎగ్గొట్టే ఎత్తు గడలో భాగంగా తిరిగి జిల్లా అధికారుల ద్వారా మళ్లీ ఫైలును పైకి పంపేందుకు ఎత్తుగడ వేస్తోంది. అధికారులేమో బాకీ డబ్బుల కోసం ఆ కంపెనీపై ఒత్తిడి తేకుండా సహకరిస్తుండడం విశేషం.

- సీనరేజీ కాంట్రాక్టులో అక్రమం
- ఏడాదికి రూ.407 కోట్ల ఆదాయం
- రెండేళ్లకు రూ.223 కోట్లకే ఒప్పందం
- అడ్డగోలుగా కట్టబెట్టిన జగన్ సర్కారు
- సర్కారుకు రూ.25 కోట్లకుపైగా బకాయి
- చెల్లించకుండా తప్పించుకునే యత్నం
- గనుల శాఖ నుంచి ఒత్తిడి
- ఉలుకూపలుకూ లేని సుధాకర్ ఇన్‌ఫ్రా
- జగన్ కంపెనీకి రూ.20 కోట్లు రద్దు?
- దానివల్ల రాబడి తగ్గిందని వింత వాదన
- బాకీలో మినహాయించాలని డిమాండ్
- కాంట్రాక్టు కంపెనీకి అధికారుల వత్తాసు
- ఎన్నికల ముందు ప్రభుత్వానికి లేఖ
- ప్రభుత్వం మారడంతో కంపెనీకి షాక్
- మే నుంచి నిలిచిన వసూళ్ల దందా

రూ.814 కోట్ల ఆదాయం వచ్చేది.. 233 కోట్లకే కట్టబెట్టేసి..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గనుల శాఖకు చిన్న తరహా ఖనిజాల ద్వారా వచ్చే సీనరేజీ ఆదాయం రాష్ట్రంలో ఏ జిల్లా నుంచి సమకూరడం లేదు. ప్రధానంగా ఉమ్మడి జిల్లాలో భారీ నల్లరాయి కొండలు, గ్రావెల్, మట్టి, లేటరైట్ తవ్వకాలకు అనుమతులు ఇవ్వడం ద్వారా ఏటా కోట్లలో ఆదాయం ప్రభుత్వానికి సమకూరుతోంది. ప్రత్తిపాడు, తుని, పెద్దాపురం, రాజమహేంద్రవరం రూరల్, రాజానగరం, పి.గన్నవరం, రాజోలు, ముమ్మిడివరం తదితర నియోజకవర్గాల్లో క్వారీ, గ్రావెల్, మట్టి తవ్వకాల ద్వారా ఎక్కువ రాబడివస్తోంది. వీటి తవ్వకాలకు అనుమతులు ఇవ్వడం ద్వారా సీనరేజీతో పాటు రకరకాల ఫీజుల ఆదాయం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా గనుల శాఖకు ఏటా రూ.407 కోట్ల వరకు వచ్చేది. అయితే చిన్న ఖనిజాలకు సంబంధించి సీనరేజీ రాబడి ఇంకా వచ్చే అవకాశం ఉన్నా గనుల శాఖ పెద్దగా దృష్టి సారించేది కాదు. కేవలం ఎంత ఆదాయం వస్తే అంత అన్నరీతిలో వ్యవహరించేది. సరిగ్గా గత వైసీపీ ప్రభుత్వ పెద్దలు దీనిపై కన్నేశారు. చిన్న తరహా ఖనిజాల సీనరేజీ వసూలు బాధ్యత నుంచి గనుల శాఖను పక్కన పెట్టి మొట్టమొదటిసారిగా సుధాకర్ ఇన్‌ఫ్రా అనే ప్రైవేటు కంపెనీకి కట్టబెట్టేశారు. దీని వెనుక భారీ తతంగం నడిపారు. టెండర్ల జారీ దగ్గర నుంచి దాఖలు వరకు మూడో కంటికి తెలియకుండా అంతా రహస్యంగా నడిపారు. దీంతో ప్రభుత్వ పెద్దలు తాము అనుకున్న కంపెనీకే ఈ కాంట్రాక్టు కట్టబెట్టారు. గనుల శాఖను పూర్తిగా డమ్మీగా మార్చేసి సీనరేజీ వసూలు బాధ్యత నుంచి తప్పించేసి పెత్తనమంతా సుధాకర్ ఇన్‌ఫ్రాకు కట్టబెట్టేశారు. గనుల శాఖతో సంబంధం లేకుండా ఈ కంపెనీకి సర్వాధికారాలు ఇచ్చేశారు. 2023 ఏప్రిల్ నుంచి 2025 ఏప్రిల్ వరకు రెండేళ్లపాటు కాంట్రాక్టు కట్టబెట్టేశారు. రెండేళ్లకు కలిపి రూ.233 కోట్లు ప్రభుత్వానికి చెల్లిస్తే చాలని కాంట్రాక్టులో పేర్కొన్నారు. అది కూడా నెలకు రూ.9.70 కోట్లు చొప్పున 24 వాయి దాల్లో చెల్లించొచ్చని వెసులుబాటు ఇచ్చేశారు. దీని వెనుక ప్రభుత్వ పెద్దలు సదరు కంపెనీ నుంచి భారీగా పిండేశారు. ఇంకేం ప్రభుత్వం అండదండలు ఉండడంతో సదరు సుధాకర్ ఇన్‌ఫ్రా ఉమ్మడి జిల్లాను పిండేసింది. ఎక్కడికక్కడ ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కొండలు, గుట్టలు, గ్రావెల్, క్వారీలున్న ప్రతిచోటా సొంతంగా మనుషులను నియమించేసింది. సీసీ కెమెరాలు బిగించి సొంత రసీదులతో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసింది. రాజ మహేంద్రవరం ఆటోనగర్, ధవళేశ్వరం బ్యారేజీపై కూడా తాత్కాలిక చెక్ పోస్టులు పెట్టేశారు. రాత్రీ పగలూ తేడా లేకుండా ఎవరు ఏ చిన్న మట్టి/గ్రావెల్ తవ్వుకున్నా ముక్కు పిండి సీనరేజీ వసూలు చేసేవారు. ప్రత్తిపాడు, తుని నియోజకవర్గాల్లో వందలాది క్వారీల నుంచి నల్ల రాయి ఇతర జిల్లాలకు ఎగుమతవగా, ఆ లారీల నుంచి ఒక్క రూపాయి కూడా వదలకుండా ముక్కు పిండి నెల నెలా కోట్లలో డబ్బులు పిండేసింది. తెర వెనుక కాకినాడ జిల్లాకు చెందిన ఓ కీలక వైసీపీ నేత సహకారం ఉండడంతో గనులశాఖ సైతం కళ్లుమూసే సుకుంది.సీనరేజీ వసూళ్లలో నిబంధనలు ఉల్లంఘించినా అటువైపు కన్నెత్తి కూడా చూడలేదు. ప్రభుత్వానికి నెలకు కట్టాల్సిన రూ. 9.70కోట్ల కంటే అంతకుమించి రెట్టింపు ఆదాయం పిండేసింది. ఒకరకంగా చెప్పాలంటే సీనరేజీ కాంట్రాక్టు ఈ కంపెనీకి కాసుల పంట పండించింది.

పాఠశాలల ప్రాంగణాల్లో పౌష్టికాహార మొక్కల పెంపకం

- విద్యాపరంగా జిల్లాను ముందంజలో నిలపాలి
- కలెక్టర్ మహేష్‌కుమార్



అమలాపురం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఉద్యాన, కృషి విజ్ఞాన కేంద్రాల సమన్వయంతో జిల్లాలోని పాఠశాలల ప్రాంగణాల్లో పౌష్టికాహార మొక్కలు, కూరగాయల పెంపకానికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ రావిరాల మహేష్‌కుమార్ ఆదేశించారు. న్యూట్రిషన్ గార్డెన్స్‌లో ఉత్పత్తులను మధ్యాహ్న భోజన పథకంలో వినియోగించి పిల్లలకు పోషకాహారం అందించాలన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లా విద్యా శాఖ, సమగ్ర శిక్షా అధికారులతో సమావేశం నిర్వహించారు. విద్యా వ్యాప్తికై అమలు చేస్తున్న పథకాల అమలు తీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తూ నాణ్యమైన విద్యా బోధన చేపట్టి 95 శాతం ఉత్తీర్ణతా శాతం సాధించాలన్నారు. పదో తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యేలా చర్యలు చేపట్టి ప్రతి ఒక్కరూ కనీస విద్యా ప్రమాణాలు సాధించేలా చూడాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం మెనూను కచ్చితంగా అమలు చేయాలన్నారు. విద్యార్థుల మెదడు చురుగ్గా పనిచేసి ప్రతిభ కనబరిచేందుకు వీలుగా ప్రభుత్వం పోర్టిఫైడ్ బియ్యాన్ని సరఫరా చేస్తోందన్నారు. పాఠశాలల్లో విద్యార్థులు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఆర్వో వాటర్ ప్లాంటు ద్వారా సురక్షిత తాగు నీరు అందించాలన్నారు. బడి బయట పిల్లలు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. స్టూడెంట్ కిట్ ప్రతి విద్యార్థికీ అందేలా చూడాలన్నారు. ఫార్మేటీవ్, సెమిస్టర్ పరీక్షలను సకాలంలో నిర్వహిస్తూ పబ్లిక్ పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించి జిల్లాను విద్యాపరంగా ముందంజలో నిలపాలని సూచించారు. భవిత కేంద్రాల్లో ఫిజియోథెరపీ చేయడం ద్వారా సకాలంగులుగా తీర్చిదిద్దేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో పాఠశాలల్లో ల్యాబ్‌లు, ఆట స్థలాల వంటి మౌలిక సదుపాయాలు కల్పించి చదువుతో పాటు పరిశోధనాత్మక విజ్ఞానం పెంపొందించాలన్నారు. సమావేశంలో డీఈవో ఎం.కమలకుమారి, సమగ్ర శిక్షా సహాయ ప్రోగ్రాం అధికారి మధుసూదనరావు, జిల్లా సైన్స్ అధికారి సుబ్రహ్మణ్యం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ధరల నియంత్రణకు ప్రత్యేక చర్యలు

రేపటి నుంచి రైతు బజార్లలో నిత్యావసరాలు విక్రయం: జేసీ



అమలాపురం టౌన్, జూలై 9: బహిరంగ మార్కెట్‌లో నిత్యావసరాలైన బియ్యం, కందిపప్పు ధరలు పెరిగిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ధరల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టిందని జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్‌అజయ్ తెలిపారు. రైతు బజార్లలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటుచేసి గురువారం నుంచి రేషన్‌కార్డులపై వినియోగదారులకు బియ్యం, కందిపప్పు తక్కువధరకు విక్రయించేందుకు చర్యలు చేపట్టామన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన జిల్లాస్థాయి ధరల నియంత్రణ కమిటీ సమావేశంలో జేసీ మాట్లాడారు. కందిపప్పు కిలో రూ.160, స్టీమ్ బియ్యం కిలో రూ.49, సోనామసూరి కిలో రూ.48కి రైతుబజార్లలో విక్రయించనున్నందున లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులు, మిల్లర్లు, ట్రేడర్లు సహకరించాలని కోరారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి ఎ.పాపారావు, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజరు డీవీఎస్ యల్లారావు, అసిస్టెంట్ మేనేజరు నాగేశ్వరరావు, మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకురాలు కె.విశాలాక్షి, తూనికలు, కొలతలు శాఖల అధికారులు, రైస్‌మిల్లర్ల యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.





లంకల గన్నవరం వైపు పంటకాల్వ తొట్టెలో మూసుకున్న తలుపులు, తెరిచి ఉన్న తలుపులను మూసే ప్రయత్నం చేస్తున్న ఇరిగేషన్ సిబ్బంది

మొరాయింపు

- పి.గన్నవరం అక్విడెక్టు పంట కాల్వ తొట్టె తలుపులకు ఇరిగేషన్ అధికారుల ట్రయల్ రన్
- సాంకేతిక లోపంతో మొరాయించిన వైనం

పి.గన్నవరం, జూలై 9: వరదలు వచ్చినప్పుడే ఆ తలుపులు అవసరం. మిగిలిన సమయంలో వాటివైపు ఇరిగేషన్ అధికారులు, సిబ్బంది కన్నెత్తి చూడరు. దీంతో వరదల సమయంలో అవి మొరాయిస్తుంటాయి. ఈ క్రమంలో రాబోయే వరదలను దృష్టిలో ఉంచుకుని పి.గన్నవరం అక్విడెక్టు కాల్వ తొట్టెకు ఇరువైపులా ఉన్న తలుపులను ఉన్నతాధికారుల ఆదేశం మేరకు మంగళవారం మధ్యాహ్నం ట్రయల్ రన్ వేశారు. నీటి వేగాన్ని అనుసరించి ముందుగా లంకల గన్నవరం వైపు ఉన్న తలుపులను మూసే ప్రయత్నం చేయగా మూసుకున్నాయి. మళ్లీ తెరిచే ప్రయత్నం చేస్తే గేర్‌బాక్స్‌లో తలెత్తిన లోపంతో మొరాయించాయి. పి.గన్నవరం వైపు ఉన్న తలుపులు కూడా కొద్దిపాటి సాంకేతిక లోపంతో పూర్తిస్థాయిలో పడట్లేదని తెలిసింది. సాంకేతిక లోపాలను సరిదిద్దడానికి ఇరిగేషన్ వర్క్స్ షాపు నుంచి సిబ్బంది రానున్నట్లు సమాచారం. మూసుకుపోయిన తలుపులను తెరవకపోతే రాజోలు దీవికి సాగునీరు నిమిత్తం ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. కాగా ప్రస్తుతం లంకలగన్నవరం వైపు మూసుకుపోయిన తలుపుల కింది భాగంలో ఉన్న జీబిలు నుంచి సాగునీరు బయటకు వెళ్తోంది. ఇదిలా ఉండగా గతంలో వచ్చిన వరదల్లో తలుపులు పూర్తిస్థాయిలో మొరాయించడంతో వరద నీరు కాల్వలో పడి పలు పల్లపు ప్రాంతాలు, వరిచేలు సైతం నీట మునిగాయి. విషయం కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో తలుపులు మరమ్మతులు, కాల్వ తొట్టెకు రెయిలింగ్ నిమిత్తం రూ.45 లక్షలు కేటాయించారు. ఆ నిధులతో సగం పనులు మాత్రమే చేశారు. ప్రస్తుత కలెక్టర్ మహేష్‌కుమార్ ఆదేశాలతో రెయిలింగ్, విద్యుదీకరణ, అక్విడెక్టుపై రహదారి అభివృద్ధికి సుమారు రూ.40లక్షలతో అంచనాలతో రూపొందించి కలెక్టర్‌కు పంపిస్తామని డీఈ కె.వెంకటేశ్వరరావు తెలిపారు.

పి.గన్నవరం అక్విడెక్టు నిర్వహణ, అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

- కలెక్టర్ మహేష్‌కుమార్

పి.గన్నవరం, జూలై 9: పి.గన్నవరం అక్విడెక్టు నిర్వహణ, అభివృద్ధికి అంచనాలు రూపొందించి, ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించాలని ఇరిగేషన్ అధికారులను కలెక్టర్ రావిరాల మహేష్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం ఉదయం ఆయన ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణతో కలిసి అక్విడెక్టును పరిశీలించి పైవిధంగా సూచించారు. రెయిలింగ్, విద్యుదీకరణ, రహదారి, గోతులు పూడ్చడం తదితర పనులకు అంచనాలతో కూడిన ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. అనంతరం కాల్వ తొట్టె తలుపులు, రెయిలింగ్, గోతులను స్వయంగా పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వరదల సమయంలో బలహీనంగా ఉండే ఏటిగట్ల వివరాలను హెడ్‌వర్క్స్ డీఈ గంగుమళ్ల శ్రీనివాస్ మ్యాప్ చూపిస్తూ కలెక్టర్‌కు వివరించారు. గత వరదల సమయంలో అక్విడెక్టు పరిధిలో చోటుచేసుకున్న పరిణామాల దృష్ట్యా కలెక్టర్ నిధులతో జరిగిన అభివృద్ధిని ఇరిగేషన్ డీఈ కె.వెంకటేశ్వరరావు కలెక్టర్‌కు వివరించారు. కొత్త, పాత అక్విడెక్టుల వద్ద పేరుకుపోయిన ప్రధాన సమస్యలను ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ వివరించారు. కలెక్టర్ వెంట తహసీల్దారు ఎస్‌కే హుస్సేన్, ఇరిగేషన్, హెడ్‌వర్క్స్ జేఈలు కె.రాధాకృష్ణ, టీవీఎల్ఎన్ మూర్తి, సుందర్‌సింగ్, ప్రసాద్ ఉన్నారు.



పి.గన్నవరం అక్విడెక్టును పరిశీలిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్



22 ఏళ్ల క్రితం మూసేశారు!

- నేటికీ తెరుచుకోని ఆలమూరు సబ్ జైలు
- రిమాండ్ ఖైదీల తరలింపులో ఇక్కట్లు

ఆలమూరు, జూలై 9: రిమాండ్ ఖైదీలకు సరైన రక్షణ కల్పించడంలో విఫలమైన ఆ శాఖ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఆలమూరు సబ్ జైలు మూతపడింది. బ్రిటిష్ కాలంలో ఆలమూరులో సబ్ జైలు నిర్మించారు. 2002 మే 30న దానిని అధికారికంగా మూసివేశారు. అప్పట్నుంచీ ఆలమూరు కోర్టులో రిమాండ్ విధించిన ఖైదీలను రామచంద్రపురం తీసుకెళ్లాల్సి వస్తోంది. కోర్టు వాయిదాలకు అక్కడి నుంచి ఇక్కడికి తీసుకురావాల్సిన పరిస్థితి. దీంతో నిత్యం బిజీబిజీగా ఉండే పోలీసులకు ఇది సవాలుగా మారింది. ఆలమూరు కోర్టు పరిధిలోని ఆలమూరు, అంగర, మండపేట, మండపేట రూరల్ పోలీసు స్టేషన్లతో పాటు ఆలమూరులోని ఎస్ఈబీ స్టేషన్‌కు సంబంధించిన కేసుల్లో రిమాండ్ విధించిన వారిని ఆలమూరు నుంచి రామచంద్రపురం సబ్ జైలుకు తీసుకెళ్లాల్సి వస్తోంది. ఈ కారణంగా సిబ్బంది అధిక వ్యయప్రయాసలకు లోనవుతున్నారు. ఆలమూరు సబ్ జైలులోని ముగ్గురు ఖైదీలు (అంతర్ జిల్లా దొంగలు) 2002 మే 29న సిబ్బంది కళ్లుగప్పి పారిపోయారు. దీంతో అక్కడ సరైన భద్రత లేదనే నెపంతో అప్పట్లో అక్కడ ఉన్న ఖైదీలను తక్షణం రామచంద్రపురం సబ్ జైలుకు తరలించి ఆలమూరు సబ్ జైలును మూసివేశారు. ఇప్పటిదాకా తెరుచుకోలేదు. బ్రిటీష్ కాలంలో రెవెన్యూ, సబ్ ట్రెజరీ, రిజిస్ట్రార్ కార్యాలయాలతో పాటు సబ్ జైలును ఒకే కాంపౌండులో నిర్మించారు. రెండు దశాబ్దాలకు పైగా సబ్ జైలు మూతపడి ఉండటంతో విషసర్పాలకు నిలయంగా మారింది. దీంతో ఆయా కార్యాలయాలకు వచ్చే ప్రజలతో పాటు అందులో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు వణికిపోతున్నారు. జైళ్ల శాఖ అధికారులు స్పందించి సబ్ జైలును తెరిపించాలని పలువురు కోరుతున్నారు.

భవన నిర్మాణ కార్మికుల కడుపు నింపేందుకు

ఉచిత ఇసుక విధానం

రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్



ఉచిత ఇసుక పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి దుర్గేష్

రాజమహేంద్రవరం సిటీ, జూలై 9: చంద్రబాబు, పవన్‌కల్యాణ్ హామీ మేరకు ఉచిత ఇసుకను వినియోగదారులకు అందించే కార్యక్రమాన్ని రాజమహేంద్రవరంలో ప్రారంభించడం శుభపరిణామమని, గత ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల కడుపుకొడితే కూటమి ప్రభుత్వం కడుపు నింపే విధంగా ఉచిత ఇసుక విధానం తీసుకొచ్చిందని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. రాజమహేంద్రవరం లాలాచెరువు ఇసుక స్టాక్ పాయింట్ వద్ద ఉచిత ఇసుక పాలసీని మంత్రి దుర్గేష్, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, కలెక్టర్ పి.ప్రశాంతి, కమిషనర్ దినేష్‌కుమార్, ఆర్డీవో చైత్రవర్షిణిలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో వినియోగదారుడు ఎవరైనా ఇల్లు కట్టుకోవాలంటే ఇబ్బందులు పడడం చూశామని, దీంతో కేవలం ట్రాన్స్‌పోర్టేషన్‌కు రుసుము కట్టుకునేలా ఉచితంగా ఇసుక విధానాన్ని తీసుకొచ్చామన్నారు. గతం తాలూక ముసుగు తీసి వేసి ఇసుక పాలసీని సమర్థవంతంగా నిర్వహిస్తామన్నారు. ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో సహజ వనరులు దోపిడీకి గురయ్యాయని, గతంలో తాను కడియపులంకకు వెళ్లి పరిశీలించినప్పుడు అక్కడ అక్రమంగా నదీ గర్భంలోకి వెళ్లి ఇసుకను దోచేసిన సంఘటన వెలుగులోకి తీసుకొచ్చామన్నారు. జేపీ కంపెనీ, మరో కంపెనీలు చేసిన దానిపై సీబీఐ విచారణ జరపాలని కూడా సీఎం చంద్రబాబుకు లేఖ పంపినట్టు గుర్తుచేశారు. ఇసుకను బోట్స్‌మెన్ సొసైటీలను రివైజ్ చేస్తూ దానిని స్టాక్ పాయింట్‌కు తీసుకువచ్చి అక్కడ నుంచి పేదలకు ఉచితంగా అందించాలని ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ గతంలో జగన్ అతని ప్రజాప్రతినిధులు విచ్చలవిడిగా ఇసుకను దోచేశారన్నారు. జేపీ ఇచ్చే ఒక వేబిల్లుతో ఎన్నో ట్రిప్పులు వేసేవారన్నారు. గత ప్రభుత్వంలో ఇసుక దందాలో ఉన్న ప్రతి ఒక్కరి డేటా తమ వద్ద ఉన్నదని చర్యలు ఉంటాయన్నారు.

ప్రభుత్వానికి లాభాపేక్ష లేకుండా ఉచిత ఇసుక విధానం: కలెక్టర్

పేదలకు ఉచిత ఇసుక పాలసీ ప్రారంభించామని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. స్టాక్ పాయింట్ వద్ద ఆమె మాట్లాడుతూ జిల్లాలో 4 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందన్నారు. ఇసుక కావాల్సిన వారు ఆధార్ కార్డు, ఇంటి ప్లాన్ అప్రూవల్ కాపీ తీసుకుని రావాలన్నారు. పాత ఇళ్ల మరమ్మతులు చేయించుకునేవారు పాత ప్లాన్లు తీసుకుని రావాలన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్, పోలీస్ డిపార్టుమెంట్ల సమన్వయంతో ఇసుక పాలసీని సమర్థవంతంగా అమలు చేస్తామన్నారు. ఇతర రాష్ట్రాలకు ఇసుక తరలి పోకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామన్నారు. చెక్‌పోస్టుల వద్ద విజిలెన్స్ ఉంటుందన్నారు. ఇతర జిల్లాలకు ఇసుక ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ముఖ్యంగా విశాఖ జిల్లాకు ఇవ్వాల్సి ఉంటుందని అటువంటి వాటికి కలెక్టర్ రిక్వస్ట్ ద్వారా ఇవ్వాల్సి ఉందన్నారు.. బోట్స్‌మెన్ సొసైటీల డిసిటేషన్‌కు సంబంధించి ధవళేశ్వరం సీఈ చూస్తున్నారన్నారు. స్టాక్ పాయింట్‌లో డిప్యూటీ తహశీల్దార్లను పెడుతున్నామన్నారు. వినియోగదారులకు ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా ఫిర్యాదుల కోసం టోల్‌ఫ్రీ నెంబరు 1800 4252540కు ఫోను చేయాలని చెప్పారు. ప్రజలు తమకు నచ్చిన వాహనాల్లో వచ్చి లోడింగ్ చార్జీలు చెల్లించి నేరుగా ఇసుకను తీసుకువెళ్లవచ్చని తెలిపారు. జిల్లాలో 7 ఇసుక స్టాక్ పాయింట్‌లు ఉన్నాయని, వాటిలో చిడిపి స్టాక్ యార్డ్ వద్ద 36,051 టన్నులు, పందలపర్రు స్టాక్ పాయింట్‌లో 52,082 టన్నులు, పెండ్యాలలో 1,46,259 టన్నులు, ఉసులుమర్రులో 33,065 టన్నులు, కాతేరులో స్టాక్ యార్డ్‌లో 6,939 టన్నులు, లాలాచెరువు వద్ద 7,403 టన్నులు, బుర్రిలంక స్టాక్ పాయింట్ వద్ద 20,862 టన్నులు ఇసుక ఉందని తెలిపారు. టన్ను ఇసుక ధర రూ.270గా ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. నూతన ఇసుక విధానంలో దుర్వినియోగం చేస్తే సహించేదిలేదని, ఇసుక బ్లాక్ మార్కెట్‌పై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మైనింగ్ ఏడీ సుబ్రహ్మణ్యం, ఆర్డీవో శ్రీదేవి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, కుడుపూడి సత్తిబాబు, నక్కా దేవివరప్రసాద్, కోసూరి చండీప్రియ, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఏపీఈఏపీసెట్ వెబ్ కౌన్సెలింగ్

జేఎన్టీయూకే, జూలై 9: ఇంజనీరింగ్ కళాశాలల్లో సీట్ల భర్తీ లకోసం ఈనెల 1న ప్రారంభమైన ఆన్‌లైన్ వెబ్ కౌన్సెలింగ్ మంగళవారం కూడా కొనసాగింది. ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఈనెల 7తో ముగిసింది. ధ్రువపత్రాల పరిశీలన 4న మొదలు కాగా ఇప్పటి వరకూ కాకినాడ జేఎన్టీయూకే సహాయ కేంద్రంలో 4200 మంది అభ్యర్థుల ధ్రువపత్రాలను ఆన్‌లైన్‌లో పరిశీలించినట్లు హెల్ప్‌లైన్ సెంటర్ సమన్వయకర్త ప్రొఫెసర్ ఎస్.బాలాజీ తెలిపారు. అంతే కాకుండా వెబ్ ఆప్షన్ల నమోదు ప్రక్రియ ఈనెల 12 వరకూ కొనసాగుతుందని, 13న ఆప్షన్లను మార్పు చేసుకోవచ్చని, 16న సీట్ల కేటాయింపు జరుగుతుందని 17 నుంచి 22లోపు సంబంధిత కళాశాలల్లో రిపోర్టు చేయాలని ఈనెల 19 నుంచి తరగతులు ప్రారంభమవుతాయన్నారు. అభ్యర్థులకు ఏమైనా సందేహాలుంటే వర్సిటీలోని యూసీఈకేలో ఏర్పాటు చేసిన సహాయ కేంద్రంలో సంప్రదించాలని సూచించారు. అంతే కాకుండా 79956 81678, 79958 65456, 91779 27677 హెల్ప్‌డెస్క్ నెంబర్లకు ఫోన్ చేయవచ్చని బాలాజీ తెలిపారు.

ఏపీఈపీడీసీఎల్ మొబైల్ యాప్ ద్వారా

విద్యుత్ బిల్లుల చెల్లింపులు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 9: ఆంధ్రప్రదేశ్ తూర్పు విద్యుత్ పంపిణీ సంస్థ(ఏపీఈపీడీసీఎల్) వినియోగదారులు విద్యుత్ బిల్లులను ఏపీఈపీడీసీఎల్ మొబైల్ యాప్ ద్వారా చెల్లించవచ్చని ఆ సంస్థ సీఎండీ పృథ్వీతేజ్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం రాజమహేంద్రవరంలో ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆర్‌బీఐ మార్గదర్శకాలను అనుసరించి ఇకపై ఫోన్‌పే, జీపే, పేటీఎం ఇతర యూపీఐ యాప్స్‌లో విద్యుత్ బిలులు చెల్లించేటప్పుడు ఏపీఈపీడీసీఎల్ పేరు కనిపించకపోతే గనుక వినియోగదారులు సంస్థ మొబైల్ యాప్ ఈస్ట్రన్ పవర్‌ని గూగుల్ ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొని గాని, సంస్థ వెబ్‌సైట్ నుంచి గాని బిల్లులు చెల్లించవచ్చని తెలిపారు. ఏపీఈపీడీసీఎల్ మొబైల్ యాప్ గాని వెబ్‌సైట్ ద్వారా గాని బిల్లులు చెల్లించేటప్పుడు వినియోగదారులు తమ ఫోన్‌పే, జీపే, పేటీఎం ఇతర యూపీఐ యాప్స్‌తో పాటు డెబిట్, క్రెడిట్, నెట్ బ్యాంకింగ్, వాలెట్స్, క్యాష్ కార్డ్స్ కూడా వాడుకోవచ్చని సీఎండీ చెప్పారు. వినియోగదారులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని సకాలంలో విద్యుత్ బిల్లులను చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

ఇంటర్ విద్యార్థులకు పంపిణీకి సిద్ధంగా

బ్యాగులు, పుస్తకాలు

తొండంగి,జూలై 9: ముఖ్యమంత్రి చంద్రబాబు, మానవ వనరుల శాఖ మంత్రి లోకేశ్ ఆదేశాల మేరకు ప్రభుత్వం ఇంటర్మీడియట్ విద్యార్థులకు కూడా బ్యాగులు, నోటు పుస్తకాలు అందించేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా కస్తూర్బా విద్యాలయాల్లో చదివే విద్యార్థులకు, ప్రభుత్వ కళాశాలల్లో ఇంటర్ చదివే విద్యార్థులతో పాటు హైస్కూల్ ప్లస్ విద్యార్థులకు బ్యాగులతో పాటు 6 వైట్, 6 రూళ్ల లాంగ్ నోటు పుస్తకాలు అందిస్తున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా 17964 మంది విద్యార్థులకు వీటిని అందించనున్నారు. ఇప్పటికే వీటిని మండల కేంద్రాలకు పంపిణీ చేశారు. కాకినాడ జిల్లాలో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు 4026 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 3802 మంది ఉండగా కోనసీమ జిల్లాలో మొదటి సంవత్సరం విద్యార్థులు 1790 మంది, రెండో సంవత్సరం విద్యార్థులు 1763 మంది, తూర్పుగోదావరి జిల్లాలో మొదటి సంవత్సరం విద్యార్థులు 3326 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 3257 మంది ఉన్నారు. మొత్తం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొదటి సంవత్సరం 9142 మంది, ద్వితీయ సంవత్సరం 8822 మంది విద్యార్థులు లబ్ధి పొందనున్నారు.

సమగ్ర శిక్షా సిబ్బంది జీతాల బకాయిలు విడుదల చేయాలి

అమలాపురం టౌన్, జూలై 9: పాఠశాల విద్యా శాఖలోని సమగ్ర శిక్షాలో పనిచేస్తున్న 25వేల మంది కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, పార్ట్ టైమ్ ఉద్యోగులకు బకాయిపడ్డ జీతాలను వెంటనే విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ పీడీఎఫ్ ఎమ్మెల్సీలు యిళ్ల వెంకటేశ్వరరావు (ఐవీ), కేఎస్ లక్ష్మణరావు మంగళవారం ఆన్‌లైన్ ద్వారా రాష్ట్ర ఉన్నతాధికారులకు, మంత్రికి లేఖలు పంపించారు. మే, జూన్ నెల జీతాలను చెల్లించాల్సి ఉందని, జీతాల బడ్జెట్‌ను వెంటనే విడుదల చేసి చిరుద్యోగులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. జీతాల బకాయిలతో పాటు గత ఏడాది డిసెంబరు 19 నుంచి జనవరి 9 వరకు 22 రోజుల పాటు సమగ్ర శిక్షా సిబ్బంది డిమాండ్ల సాధనకు రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేశారు. సమగ్ర శిక్షా సిబ్బంది అప్పటి జేఏసీ నాయకులతో చర్చించగా సమ్మె కాలపు జీతాలు చెల్లించేందుకు అప్పటి వైసీపీ ప్రభుత్వం ఒప్పందం చేసుకుందని ఇంతవరకు ఆ బకాయిలను విడుదల చేయలేదని విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్‌తో పాటు సమగ్ర శిక్షా ఉన్నతాధికారులకు, ఆర్థికశాఖ కార్యదర్శికి వినతిపత్రాలు పంపించారు. సమగ్ర శిక్షా ఆధీనంలో మండల విద్యా శాఖ కార్యాలయాల్లో పనిచేస్తున్న ఎంఐఎస్ కో-ఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, మండల అకౌంటెంట్లు, ఆఫీసు అసిస్టెంట్, సీఆర్‌ఎంటీలు, ఐఈఆర్టీలు, ఆయా, పీటీఐలు జీతాల కోసం ఆశగా ఎదురు చూస్తున్నారని, ప్రస్తుత ఆర్థిక పరిస్థితులు, పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలను దృష్టిలో పెట్టుకుని ఆయా కుటుంబాలు అప్పుల బారిన పడకుండా జీతాల బకాయిలు విడుదల చేయాలని ఎమ్మెల్సీ ఐవీ కోరారు.

ఎరువుల షాపుల్లో విజిలెన్స్ తనిఖీలు

కోరుకొండ, జూలై 9: రాష్ట్ర వ్యాప్తంగా ఎరువులు, పురుగుమందుల షాపులు తనిఖీల్లో భాగంగా కోరుకొండ వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. దీనిలో భాగంగా కోరుకొండకు చెందిన గ్రోమోర్ ఎరువుల షాపును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉండాల్సిన బరువు కంటే తక్కువ బరువు కలిగి ఉన్నారన్న కారణంగా రూ.1.36 లక్షలు విలువైన 177 బస్తాల ఎరువులను సీజ్ చేసినట్లు విశాఖపట్నానికి చెందిన ఆత్మ డిప్యూటీ ప్రాజెక్టు డైరెక్టర్ ఎ.మోహన్‌రావు తెలిపారు. అదే విధంగా హరి ఎరువుల షాపును తనిఖీ చేయగా అక్కడ ఒక రకం పురుగుల మందు శాంపిల్ తీయని కారణంగా ఈ మందు అమ్మకాన్ని నిలుపుదల చేశామన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడుతూ గత నాలుగు రోజులు తూర్పుగోదావరిలో ఎరువులు, పురుగుల మందుల తయారీ సంస్థలు, షాపులు, గోదాములు తనిఖీ చేశామన్నారు. రిటైల్, హోల్‌సేల్‌కు సంబంధించి 25 షాపులు తనిఖీ చేశామన్నారు. సుమారు రూ.66 లక్షలు విలువ గల ఎరువులు, పురుగుమందులను సీజ్ చేయడం, నిలుపుదల చేయడం చేశామన్నారు. ఈ తనిఖీల్లో శ్రీకాకుళం విజిలెన్స్ సీఐ బి.సింహాచలం, అగ్రికల్చరల్ ఏడీఏ మల్లికార్జునరావు, ఏవో గౌరీదేవి పాల్గొన్నారు.

డబుల్ ఇంజిన్ సర్కారు వట్టి ప్రగల్భాలే..

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

కాకినాడ సిటీ, జులై 9: పేరుకు తప్ప డబుల్ ఇంజన్ సర్కారుతో ఈ రాష్ట్రానికి ఒరిగేదేమీలేదని కాకినాడ సూర్యకళా మందిరంలో మూడు రోజులపాటు జరగనున్న అఖిల భారత విద్యార్థి సమాఖ్య రాష్ట్ర స్థాయి విద్య, వైజ్ఞానిక, రాజకీయ శిక్షణా తరగతులు రెండో రోజు మంగళవారం కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని, డబుల్ ఇంజిన్ సర్కార్‌తో ఆంధ్ర అభివృద్ధి సాధ్యమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి రాజమహేంద్రవరంలో జరిగిన ఆ పార్టీ రాష్ట్ర సదస్సులో చెప్పడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. 2014లో రాష్ట్రం విడిపోయిన తర్వాత ఏర్పడిన డబుల్ ఇంజిన్ సర్కార్ అప్పుడు కూడా ఏమీ చేయలేదన్నారు. ఇప్పుడు మళ్లీ ఏదో చేస్తామని ప్రగల్భాలు పలకడం రాష్ట్ర ప్రజలను మోసం చేయడమేనన్నారు. కేంద్ర ప్రభుత్వం మాటల గారడీ మాని రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలన్నారు. రాష్ట్రం విడిపోయి పది సంవత్సరాలు దాటిందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఐటీ రంగంలో దూసుకుపోతోందన్నారు. తెలంగాణ ఐటీ ద్వారా 80 బిలియన్ డాలర్ల ఆదాయం సమకూరుతుంటే ఆంధ్రలో 3.6 శాతం మాత్రమే సపోర్ట్ ఉంటోందని వివరించారు. విభజన హామీలు నెరవేర్చాలన్నా, ఆంధ్ర ప్రదేశ్ ఐటీ రంగంలో, పారిశ్రామిక రంగంలో అభివృద్ధి చెందాలన్నా ప్రత్యేక హోదా తోనే సాధ్య మన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు రాజకీయాలు పక్కన పెట్టి రాష్ట్ర అభివృద్ధి కోసం నిలబడాలని, అఖిల పక్షం ఏర్పాటు చేయాలని రామకృష్ణ సూచించారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు రాజకీయాల్లోకి రావాలని, తద్వారా సమాజంలో అవినీతిలేని రాజ కీయాలు చేయాలని రామకృష్ణ సూచించారు. ఈ సందర్భంగా భారతదేశ చరిత్ర సంస్కృతి, వక్రీకరణ అనే అంశంపై ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ కార్యవర్గ సభ్యుడు డి.సోమసుందర్, నేటి రాజకీయాలు- ప్రత్యామ్నాయం అనే అంశంపై సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, మూఢ నమ్మకాలు, సామాజిక రుగ్మతలు అనే అంశంపై ప్రముఖ వక్త పెన్మెత్స సుబ్బరాజు ప్రసంగించారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు, జిల్లా కార్యదర్శి కామిరెడ్డి బోడకొండ, జిల్లా సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్, కార్యవర్గ సభ్యులు పి.సత్యనారాయణ, టి అన్నవరం, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్‌బాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శివారెడ్డి, వివిధ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

హోంగార్డులకు ప్రభుత్వం న్యాయం చేయాలి

మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యేలు గోరంట్ల, ఆదిరెడ్డిని కలిసి విన్నవించిన పలువురు హోంగార్డులు



మంత్రి దుర్గేష్‌కు వినతిపత్రం అందిస్తున్న హోంగార్డులు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 9: రాష్ట్రంలో ఉన్న 16 వేల మంది హోంగార్డులకు ప్రభుత్వం న్యాయం చేయాలని కోరుతూ రాజమహేంద్రవరంలో రాష్ట్ర పర్యాటక, సినిమాటోగ్రఫీ, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్, రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, అర్బన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్‌కు బాధిత హోంగార్డులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం రాజమహేంద్రవరంలో వారిని కలిసి వినతిపత్రాన్ని అందించారు. హోంగార్డులను రాష్ట్ర ప్రభుత్వ యూనిఫాం సర్వీసు డిపార్ట్‌మెంట్‌లలో సీనియారిటీ ప్రాతిపాదికన విలీనం చేయాలని, ఇతర శాఖాపరమైన బెనిఫిట్స్ అమలు చేయాలని కోరారు. హోంగార్డులకు ఇస్తున్న రోజువారీ వేతనం సరిపోక ఇబ్బందులు పడుతున్నామని గత ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా స్పందించకపోవడంతో సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. హోంగార్డు వ్యవస్థ 1963 నుంచి ఇప్పటివరకు వలంటీర్ వ్యవస్థగానే పరిగణిస్తున్నారని ఏళ్ల తరబడి పోలీసులతో సమానంగా పనిచేస్తున్న తమకు ఎలాంటి ఉద్యోగ భద్రత, ఆరోగ్య భద్రత, టీఏ, డీఏ సదుపాయాలు లేవని, కానిస్టేబుల్‌గా పదోన్నతులు లేవన్నారు. హోంగార్డులుగా చేసి పదవీవిరమణ చేసిన వారికి ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆర్థిక సాయం లభించడంలేదన్నారు. అందువల్ల తమ సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, హోంమంత్రి అనిత దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరింపజేయాలని వారు విజ్ఞప్తి చేశారు. మంత్రి, ఎమ్మెల్యేలను కలిసిన కె.మురళీ, పి.పాపారావు, ఐ.సతీష్, ఇజ్రాయేలు, బాపిరాజు, లక్ష్మణ్, కామేశ్వర్, గిరి, మూర్తి, సాయి, కాళీ, సూరిబాబు, లలిత, సుజాత, భారతి, సరళ, జాన్సీ, శ్రీదేవి, 20 మంది హోంగార్డులు ఉన్నారు.

చెడు వ్యసనాలకు అలవాటు పడి చోరీలు

212 గ్రాముల బంగారం రికవరీ



నిందితుడి వివరాలు తెలియజేస్తున్న డీఎస్పీ కిషోర్‌కుమార్

రాజమహేంద్రవరం, జూలై 9(ఆంధ్రజ్యోతి): తండ్రి బాటలోనే నడిచిన కొడుకు దొంగతనాలకు అలవాటు పడ్డాడు. చిన్న వయసులో చిన్న దొంగతనాలతో మొదలుపెట్టి క్రమంగా పెద్ద చోరీల వైపు మళ్లాడు. ఓ కేసులో డొంక లాగిన పోలీసులకు చిక్కడంతో కటకటాల్లోకి నెట్టారు. ఈస్ట్ జోన్ డీఎస్పీ కిషోర్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొంతమూరుకు చెందిన కొండేటి సాయి తండ్రి రాంబాబు చోరీలు చేసేవాడు. కరోనాతో రెండేళ్ల క్రితం మృతి చెందాడు. దీంతో 10వ తరగతి వరకూ చదువుకొన్న సాయి 2017 నుంచే చిన్న చిన్న దొంగతనాలు చేయడానికి అలవాటు పడ్డాడు. మిల్క్ డెయిరీ, ఫ్లిప్‌కార్ట్ తదితర చోట్ల ఉద్యోగం చేశాడు. చెడు వ్యసనాలకు అలవాటు పడడంతో జీతం సరిపోయేది కాదు. దీంతో మళ్లీ చోరీలవైపు మళ్లాడు. ఈసారి కాస్త పెద్ద దొంగతనాలపై దృష్టి పెట్టాడు. ఇళ్లలో రాత్రి వేళల్లో దొంగతనాలు చేసేవాడు. గత ఏడాది సెప్టెంబరు 22న పాత బొమ్మూరులోని ఓ ఇంట్లో జరిగిన చోరీపై క్రైం నెం.311/2023గా బొమ్మూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించి సాయిని మంగళవారం అరెస్టు చేసి రిమాండుకు తరలించామని డీఎస్పీ వివరించారు. అతడి వద్ద నుంచి 212 గ్రాముల బంగారు, 1.5 కిలోల వెండి ఆభరణాలు, రూ.90 వేల నగదు, ఒక మోటార్‌సైకిల్‌ను రికవరీ చేశామన్నారు. రాజానగరం పీఎస్‌లో రెండు, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్లో ఒక చోరీ కేసు, అంబాజీపేట, సామర్లకోటలో బైండోవర్ కేసులు ఉన్నాయని, గడిచిన ఏడాది కాలంలో ఆరు కేసులు బొమ్మూరు పీఎస్‌లో నమోదయ్యాయని పేర్కొన్నారు. కేసు దర్యాప్తులో ప్రతిభ చూపిన సీఐ ఎండీ ఉమర్, ఎస్ఐలు బి.శ్రీను, ఆర్.అంకారావు, ఏఎస్సై ఏకే సత్యనారాయణ, హెచ్‌సీ పి.వెంకటేశ్వరరావు, పీసీ కె.సురేశ్‌బాబును ఎస్పీ జగదీశ్ అభినందించారు.



రేషన్ బియ్యాన్ని పట్టుకున్న అధికారులు

భారీగా రేషన్ బియ్యం పట్టివేత

కోటనందూరు, జూలై 9: కాకినాడ జిల్లా కోటనందూరులో శ్రీ మహలక్ష్మీ రైస్ మిల్లు నుంచి అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉంచిన రేషన్ బియ్యాన్ని విజిలెన్స్, రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. వివరాల ప్రకారం... కోటనందూరు పరిసర ప్రాంతాల నుంచి రేషన్‌కార్డుదారుల నుంచి తక్కువ రేటుకు బియ్యం కొనుగోలు చేసి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి అక్రమంగా లారీలో తరలించేందుకు సిద్ధం చేస్తుండగా పట్టుకున్నామని విజిలెన్స్ ఎస్ఐ జగన్నాథరెడ్డి తెలిపారు. ఈ తనిఖీల్లో 25,300 కిలోల రేషన్ బియ్యం, నాలుగు ఎలక్ట్రికల్ కాటాలు, 1400 కిలోల ఫోర్టిఫైడ్ రైస్, 12300 కిలోల బియ్యం, 3750 కిలోల ధాన్యం, 1500 కిలోల బ్రోకెన్ బియ్యం, 1050 కిలోల రైస్ బ్రాన్‌ను సీజ్ చేశామన్నారు. రవాణా, అమ్మకం చేస్తున్న పోతల రాంబాబు, శెట్టి శ్రీనివాస్, కోన ప్రభుదాస్, మోహన్‌లాల్‌యాదవ్, అనంద్‌దేవాంగన్‌లపై క్రిమినల్ కేసులు నమోదు చేసామని తెలిపారు. ఈ తనిఖీల్లో ఏవో భార్గవమహేష్, డీసీటీవో నవీన్‌కుమార్, లోవరాజు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాల పేరుతో రుణాలు స్వాహా

పిఠాపురం పట్టణానికి చెందిన యానిమేటర్ నిర్వాకం



విచారణ నిర్వహిస్తున్న డీఆర్‌డీఏ అధికారులు

పిఠాపురం రూరల్, జూలై 9: మహిళా సంఘాల పేరుపై రుణాలు తీసుకుని వాటిని స్వాహా చేసిన యానిమేటర్ ఉదంతం వెలుగులోకి వచ్చింది. జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు డీఆర్డీఏ అధికారులు విచారణ చేపట్టారు. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం బి.కొత్తూరు గ్రామంలో 58 మహిళా సంఘాలు ఉన్నాయి. వీటికి పిఠాపురం పట్టణానికి చెందిన దారా పద్మకుమారి యానిమేటర్‌గా వ్యవహరిస్తున్నారు. మహిళలను వివిధ సంఘాల్లో సభ్యులుగా చేర్చి బ్యాంకు ఆఫ్ బరోడా, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు సహా ఇతర బ్యాంకులు నుంచి రుణాలు ఇప్పించేది. ఈ క్రమంలో ఇతర ప్రాంతాల వారిని సభ్యులుగా చేర్చి యానిమేటర్ లక్షలాది రూపాయలను తమ పేరుపై రుణాలు తీసుకుని పక్కదోవ పట్టించిందని, 2019 నుంచి 2022 వరకూ ఈ వ్యవహారం జరిగిందని పలు మహిళా సంఘాల సభ్యులు జిల్లా కలెక్టరు షాన్‌మోహన్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై డీఆర్డీఏ అధికారులు విచారణ చేపట్టారు. తాము రుణాలు తీసుకోకుండా అప్పులు చెల్లించాలని బ్యాంకు ఆఫ్ బరోడా అధికారులు తమపై ఒత్తిడి తేవడంతో విషయం తెలిసిందని మహిళా సంఘాల సభ్యులు తెలిపారు. తాము తీసుకోని రుణాలకు ఎలా చెల్లిస్తామని తాము ప్రశ్నించి ఫిర్యాదు చేశామని చెప్పారు. వెలుగు ఏపీఎం ప్రియదర్శిని మంగళవారం 30 గ్రూపులను విచారించగా 15 గ్రూప్‌ల సభ్యులు తాము రుణాలు తీసుకున్నట్లు తెలపగా మిగిలిన వారు తీసుకోలేదని చెప్పారు. ఈ గ్రూపుల పేరు మీద రూ.60లక్షలు అక్రమంగా యానిమేటర్ రుణాలు పొందినట్లు గుర్తించారు. అదే విధంగా బ్యాంకు ఆఫ్ బరోడా మేనేజర్ యానిమేటర్ పద్మకుమారి నుంచి రూ.50 లక్షల వరకూ రికవరీ చేసినట్లు ఏపీఎం తెలిపారు. విచారణ ఇంకా కొనసాగుతున్నదని, పూర్తయితే ఎంత మేర రుణాలు అక్రమంగా పొందారో, ఎంత మేర దుర్వినియోగానికి పాల్పడ్డారో తేలుతుందని చెప్పారు.

ఎర్రకాలువలో గుర్తు తెలియని మృతదేహం

అనపర్తి, జులై 9 : అనపర్తి శివారు కొత్తూరు వద్ద ఎర్రకాలువలో మంగళవారం గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. రంగంలోకి దిగిన పోలీసులు కాలువ నుంచి మృతదేహాన్ని వెలికితీసి శవ పంచనామా నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్ఐ హనుమంతరావు మాట్లాడుతూ సుమారు 30 నుంచి 35 సంవత్సరాల వయస్సు కలిగిన పురుషుని మృతదేహాన్ని గుర్తించామని శరీరంపై స్కైబ్లూ కలర్ పొడవు చేతుల చొక్కా, నలుపు రంగు ప్యాంటు ఉందని సుమారుగా 5.6 ఎత్తు ఉండవచ్చని ఎస్ఐ తెలిపారు. చనిపోయి రెండు రోజుల పైబడి కావచ్చని మృతదేహం గుర్తుపట్టేందుకు వీలులేకుండా ఉందని దుస్తుల ఆధారంగా వివరాలు తెలిసిన వారు అనపర్తి పోలీసులను సంప్రదించాలని అన్నారు, వీఆర్వో కోసూరి రవికుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించినట్లు తెలిపారు.

53 వేల క్యూసెక్కులు సముద్రంలోకి

ధవళేశ్వరం, జూలై 9: ధవళేశ్వరం వద్ద గోదావరి ప్రవాహం నిలకడగా కొనసాగుతోంది. బ్యారేజ్ నుంచి 53,464 క్యూసెక్కుల మిగులు జలాలను దిగువకు విడుదల చేస్తున్నారు. వ్యవసాయ అవసరాల కోసం 9700 క్యూసెక్కులను 3 డెల్టా కాలువలకు విడుదల చేస్తున్నారు. కాటన్ బ్యారేజ్ ధవళేశ్వరం ఆర్మ్‌లో 45 గేట్లు, ర్యాలీ ఆర్మ్‌లో 20 గేట్లు, మద్దూరు ఆర్మ్‌లో 5 గేట్లు, విజ్జేశ్వరం ఆర్మ్‌లో 15 గేట్లను 20 మిల్లీమీటర్ల మేర పైకి ఎత్తి మిగులు జలాలను దిగువకు విడిచిపెడుతున్నారు. ధవళేశ్వరం వద్ద నీటి మట్టం 10.90 అడుగులుగా నమోదయింది. తూర్పుడెల్టాకు 3600 క్యూసెక్కులు, మధ్యడెల్టాకు 2100 క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 4 వేల క్యూసెక్కుల చొప్పున కాలువలకు నీటిని విడుదల చేస్తున్నారు.

లక్ష్యాలను అధిగమించేలా ఉపాధ్యాయుల శిక్షణ ఉండాలి

టీచ్ టూల్ ప్రాజెక్టు స్టేట్ ఇన్‌చార్జి సతీష్‌రెడ్డి

రాజమహేంద్రవరం సిటీ, జూలై 9: ఉపాధ్యాయులకు ఇచ్చే శిక్షణ లక్ష్యాలను అధిగమించేలా ఉండాలని టీచ్ టూల్ ప్రాజెక్టు స్టేట్ ఇన్‌చార్జి డాక్టర్ పి.సతీష్‌రెడ్డి అన్నారు.. టీచ్ టూల్ కార్యక్రమంపై రాజమహేంద్రవరం డీఎంహెచ్ స్కూల్లో 9 రోజులుగా జరుగుతున్న ఉపాధ్యాయుల శిక్షణా తరగతులను మంగళవారం ఆయన రాష్ట్ర పర్యవేక్షక బృందంతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బోధనను మెరుగుపరచడం కోసం, మూల్యాంకనం చేయడం కోసం టీచ్ టూల్ అనే సాధనాన్ని అభివృద్ధి చేసి ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్, ప్రైమరీ టీచర్, సీఆర్పీలకు శిక్షణ ఇస్తున్నారన్నారు. ప్రతిఒక్కరు శిక్షణ లక్ష్యాలను బాగా అవగాహన చేసుకోవాలన్నారు. ఇప్పటివరకు జరిగిన శిక్షణ డాక్యుమెంటేషన్‌ను పరిశీలించి సూచనలు చేశారు. కార్యక్రమంలో సీమెట్ ప్రొఫెసర్ ఎ.ప్రభాకరరావు, సమగ్ర శిక్షా జిల్లా అకడమిక్ మోనటరింగ్ ఆఫీసర్ గౌరీశంకర్, కోర్స్ డైరెక్టర్, అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్‌కుమార్, రిసోర్స్‌పర్సన్స్ ఎస్.శ్రీనివాస్, జె.స్వప్నప్రియ, కె.లక్ష్మణరేఖ, ప్రవీణ్ శిరీష పాల్గొన్నారు.

నాలుగేళ్ల చిన్నారిపై అత్యాచారం

ఎటపాక,జూలై 9: నాలుగేళ్ల చిన్నారిపై ఓ యువకుడు అత్యాచారం చేశాడు. అల్లూరి జిల్లా ఎటపాక మండలంలోని ఓ గ్రామంలో జరిగిన ఈ ఘోరం ఆలస్యంగా వెలుగుచూసింది. ఛత్తీస్‌గఢ్ నుంచి పదేళ్ల క్రితం బతుకుదెరువుకు ఇక్కడకు వచ్చిన ఆదివాసీ కుటుంబం కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. వారి ఇంటిలో నాలుగేళ్ల చిన్నారి ఉంటోంది. ఆదివారం అమరవరపు రాము అనే వ్యక్తి చిన్నారి ఇంటికి వెళ్లి చాక్లెట్లు ఇస్తానని చెప్పి అతని ఇంటికి తీసుకెళ్లి అమానుషంగా అత్యాచారం చేశాడు. చిన్నారికి రెండు రోజుల నుంచి నలతగా, జ్వరంగా ఉండడంతో తల్లి అడగడంతో జరిగిన విషయాన్ని బయటపెట్టింది. దీంతో బాధిత తల్లిదండ్రుల ఫిర్యాదుతో పోలీసులు నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.


నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



విరాళం చెక్కు అందిస్తున్న దాతలు

సామర్లకోట జూలై 9: పంచారామ పుణ్యక్షేత్రమైన సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో దేవదాయ శాఖ నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన యరపోతిన వెంకటరామచౌదరి, ఆశారాణి దంపతులు లక్ష రూపాయల విరాళాన్ని చెక్ రూపంలో ఆలయ సిబ్బందికి అందజేశారు. ఆలయ కార్య నిర్వహణాధికారి బళ్ళ నీలకంఠం మాట్లాడుతూ భక్తులకు ఆలయ ఆవరణలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకం అమలుతీరును పరిశీలించి సంతృప్తి చెందిన అనంతరం వెంకటరామచౌదరి దంపతులు ఈ విరాళాన్ని అందించినట్లు తెలిపారు. దాతలకు స్వామివారి, అమ్మవారి ప్రత్యేక దర్శనాల అనంతరం ప్రసాదాలు చిత్రపటాలను ఆలయ సిబ్బంది అందించారు. వేద పండితులు సోమేశ్వర శర్మ, అంజిబాబు, వెంకన్న, శ్రీనివాసరావు, వినయ్ పాల్గొన్నారు.

సత్యదేవుని నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



విరాళం అందిస్తున్న దాతలు

అన్నవరం, జూలై 9: అన్నవరం దేవస్థానంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి మంగళవారం హైదరాబాద్‌కు చెందిన డి.వి సీతారామస్వామి లక్ష రూపాయలు విరాళంగా సమర్పించారు. ఈ మొత్తాన్ని దాత పీఆర్వో కృష్ణారావుకు అందజేయగా దాతను ఆయన అభినందించి స్వామివారి ప్రసాదం, ప్రత్యేక దర్శన సౌకర్యం కల్పించారు.

రూ.1.30లక్షల విరాళాలు

ఆత్రేయపురం, జూలై 9: వాడపల్లిలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి తణుకు మండలం కొమరవరానికి చెందిన పోతురెడ్డి సునీల్‌కుమార్-దేవిసాయికుమారి దంపతులు రూ.53,116, బూరుగుపల్లి తాతారావు రూ.25వేలు, యర్రంశెట్టి రామకృష్ణ రూ.10101, మోతుకూరి సత్యనారాయణ రూ.12,116, పాలచర్ల పద్మావతి రూ.10,116, ఆచంట శ్రీనివాసప్రభాకర్ రూ.10,116, ఇనుపకుర్తి నరసింహరావు రూ.10,116 విరాళంగా అందించారు. దాతలకు ఈవో కిషోర్‌కుమార్ స్వామివారి చిత్రపటాలను అందించారు.

ఉచిత ఇసుకపాలసీతో పేదలకు ఎంతోమేలు

ఐ.పోలవరం, జూలై 9: ఉచిత ఇసుక విధానం పేదలకు వరమని ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు (బుచ్చిబాబు) అన్నారు. మురమళ్ల పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వంలో రాష్ట్రంలో రూ.50వేల కోట్ల ఇసుక దోపిడీ జరిగిందన్నారు. రాష్ట్రంలో ఎక్కడాఇసుక, గ్రావెల్‌ను వదలకుండా దోపిడీ చేశారన్నారు. కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం అమలు చేస్తుందన్నారు. అవినీతి, అక్రమాలకు తావు లేకుండా ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరిస్తుందన్నారు.

290టన్నుల ఇసుక విక్రయం

రావులపాలెం, జూలై 9: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉచిత ఇసుక విధానంతో పేదల కష్టాలు తీరాయి. రావులపాలెం స్టాక్ పాయింట్ నుంచి మంగళవారం 290 టన్నుల ఇసుక లబ్ధిదారులకు వెళ్లిందని రెవెన్యూ అధికారులు చెప్పారు.

పేదలకు అందుబాటులో ఉచిత ఇసుక

రాజోలు, జూలై 9: రాష్ట్రంలో ఉచిత ఇసుక విధానంతో పేదలకు అందుబాటులోకి వస్తుందని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు, టీడీపీ సీనియర్ నాయకుడు జగడం సత్యనారాయణ అన్నారు. మంగళవారం బి.సావరంలోని ఆయన విలేకరులతో మాట్లాడారు. ఐదేళ్లలో సీఎం జగన్ పేదలకు నష్టం జరిగేలా పాలన సాగించారన్నారు. సీఎం చంద్రబాబు పరిపాలనా అనుభవంతో ఉచిత ఇసుక విధానంప్రవేశపెట్టడంతో పేదలకు వరమన్నారు. పేదలు, ఇసుక మీద ఆధారపడే కార్మిక వ్యవస్థలు, ప్రతీ సామాన్యునికి ఇసుక దొరికే పరిస్థితి ఏర్పడిందన్నారు.

ఆర్టీసీ ఆదర్శ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు

రాజోలు, జూలై 9: ఆర్టీసీ రాజోలు డిపో పరిధిలో అత్యధిక ఈపీకే సాధించిన కండక్టర్లకు, కేఎంపీఎల్ సాధించిన డ్రైవర్లకు డిపో మేనేజర్ పి.బాస్కరరావు ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ మంగళవారం నిర్వహించారు. నగదు ప్రోత్సాహక అవార్డులు, ప్రశంసా పత్రాలను కండక్టర్లకు ఆయన అందజేశారు. ప్రయాణికులతో మర్యాద పూర్వకంగా ప్రవర్తించి వారికి సౌకర్యవంతమైన సేవలు అందించాలన్నారు. ఎస్టీఐ కేకే దొర, టీఐ ఎంఏ రావు, ఏడీసీ వి.శ్రీను, ఆర్టీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'మాతృత్వ అభియాన్'ను ప్రత్యేకశ్రద్ధతో నిర్వహించాలి

ద్రాక్షారామ, జూలై 9: ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ కార్యక్రమాన్ని ప్రత్యేకశ్రద్ధతో నిర్వహించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా.సత్యనారాయణ సూచించారు.మంగళవారం ద్రాక్షారామ పీహెచ్‌సీలో జరుగుతున్న పీఎం సురక్షిత్ మాతృత్వ అభయాన్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. గర్భిణులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ద్రాక్షారామలో 31 మంది, వెల్ల పీహెచ్‌సీలో 40మంది గర్భిణులకు పరీక్షలు జరిపారు. సబ్‌డివిజనల్ అధికారి డా. ఎస్.ప్రశాంతి, డివిజనల్ పర్యవేక్షకుడు జి.కమల్ శేషు, సీహెచ్‌వో వీరవేణి పాల్గొన్నారు. వెల్లలో డా.స్వాతి భవానీ, డా. అలేఖ్య వైద్యసేవలు అందించారు.

నరసింహస్వామిని దర్శించుకున్న తహసీల్దార్లు

అంతర్వేది, జూలై 9: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పిఠాపురం, ఆత్రేయపురం తహసీల్దార్లు కె.లక్ష్మి, ఎం.వెంకట్రామయ్య మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికారు. స్వామి వారి దర్శనం అనంతరం వేదపండితులు మహదాశీర్వచనం చేసి తీర్థ ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో వీఆర్‌ఏలు సత్యనారాయణ, జి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

50 అనధికార లేఅవుట్లు

మలికిపురం, జూలై9: రాజోలు నియోజకవర్గం మలికిపురంలో 7, లక్కవరంలో 13, విశ్వేశ్వరాయపురంలో 16, శంకరగుప్తంలో 5, పల్లిపాలెంలో 2, గూడపల్లిలో 3, గుడిమెళ్లంకలో 2, దిండి, కత్తిమండలలో ఒకటి మొత్తం 50అనధికార లేఅవుట్లను గుర్తించినట్టు పంచాయతీ అధికారి డి.రాంబాబు తెలిపారు. అనధికార లేఅవుట్లకు అనుమతులిస్తే చర్యలు తప్పవన్నారు. వారికి నోటీసులు అందజేస్తామని, ప్రభుత్వం అనుమతులు పొందిన లేఅవుట్లలో భూములు మాత్రమే కొనుగోలు చేయాలన్నారు.

21న కాకినాడలో జాతీయ శతాధిక కవి సమ్మేళనం

అమలాపురం టౌన్, జూలై 9: శ్రీశ్రీ కళా వేదిక ఆధ్వర్యంలో కాకినాడ పీఆర్ కళాశాలలో ఈనెల21న జరిగే 137వ జాతీయ శతాధిక కవి సమ్మేళనం బ్రోచర్‌ను కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో శ్రీశ్రీ కళా వేదిక జిల్లా శాఖ అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి, కన్వీనర్ బీవీవీ సత్యనారాయణ, జాతీయ కార్యనిర్వాహ క కార్యదర్శి మాకే బాలార్జున సత్యనారాయణ, కడలి సత్యనారాయణ పాల్గొన్నారు.

మోడల్ నియోజకవర్గంగా రాజోలును తీర్చిదిద్దుదాం

ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

మలికిపురం, జూలై 9: ప్రతీ ఉద్యోగికీ సామాజిక స్పృహ అవసరమని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. మంగళవారం మలికిపురం ఎల్ఎస్ ల్యాండ్‌మార్క్‌లో రెవెన్యూ ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ అధికారులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో వరప్రసాద్ మాట్లాడుతూ రాజోలు నియోజకవర్గాన్ని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడానికి మీ అందరి సహకారం అందించాలని కోరారు. గ్రామాల్లో వీఆర్వోలు, సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది మ్యూటేషన్‌లు, సర్వేసర్టిఫికెట్లు, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు మంజూరుకు చేతివాటం ప్రదర్శిస్తున్నట్టు తన దృష్టికి వచ్చిందని, ఇక వాటికి స్వస్తి చెప్పండని హితవు పలికారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు అక్రమలేఅవుట్లకు తావు కల్పిస్తే చర్యలు తప్పవన్నారు. విలువైన ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురవుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. సఖినేటిపల్లి ప్రాంతంలో పది ఎకరాల భూమి సేకరించి కొత్త ఆర్‌డబ్ల్యుఎస్ స్కీమ్‌ను ఏర్పాటు చేద్దామన్నారు. పుట్ట గొడుగులా వస్తున్న ఆర్వో ప్లాంట్లపై పర్యవేక్షణ లేదని, పోనీ పర్యవేక్షించమని అందామంటే దందా పెరుగుతుందన్నారు. భవిష్యత్తులో వాటిపై కూడా దృష్టి పెడదామన్నారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీరాజ్, రెవెన్యూ ఆర్‌అండ్‌బీ అధికారులతో పలు సమస్యలపై చర్చించారు. తహసీల్దార్లు పెద్దిరాజు, అనితకుమారి, ఎంపీడీవోలు సత్యనారాయణ, మంగాదేవి, బాలాజీ, డీపీవో రాంబాబు, ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ రాజన్, ఆర్‌అండ్‌బీ డీఈ రవి, నియోజకవర్గంలోని వివిధ శాఖల అధికారులు, కార్యదర్శులు, వీఆర్వోలు, స్థానిక నాయకులు గుండుబోగుల పెదకాపు, పినిశెట్టి బుజ్జి, చాగంటి స్వామి, ముప్పర్తి నాని, అడబాల యుగంధర్, గుబ్బల శ్రీనివాస్, దిరిశాల బాలాజీ, గుబ్బల పణికుమార్ ఎస్.శ్రీనివాస్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాజోలు ఎమ్మెల్యే వరప్రసాద్

రాష్ట్ర బ్యాడ్మింటన్ పోటీలకు నిఖిల్‌వర్మ



మలికిపురం,జూలై9: రాజమహేంద్రవరంలో ఈనెల7,8 తేదీల్లో కొత్తపల్లి సత్యనారాయణ మెమోరియల్ టోర్నమెంట్‌లో జరిగిన జిల్లా స్థాయి ఎంపికల్లో అండర్-13డబుల్స్‌లో మలికిపురం శ్రీరామా బ్యాడ్మింటన్ అకాడమీకి చెందిన దెందుకూరి నిఖిల్, యు.నిషాంత్ ప్రథమ స్థానంసాధించారు. అండర్-11 బాలికల విభాగంలో జి.మేఘన, జి.సిద్దు జిల్లాస్థాయిలో ద్వితీయ స్థానం సాధించినట్టు అకాడమీ చైర్మన్ దెందుకూరి రాంబాబురాజు తెలిపారు.నిఖిల్‌వర్మ, నిషాంత్‌లను, క్రీడాకారులను, అకాడమీ కోచ్ హరికృష్ణలను చైర్మన్ రాంబాబురాజు, మలికిపురం డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ ఎంవీ సత్యనారాయణ, ముప్పర్తి సత్తిరాజు అభినందించారు.

ఎంపీ హరీష్‌మాధుర్‌కు సత్కారం

అమలాపురంటౌన్, జూలై 9: ఎంపీ గంటి హరీష్‌మాధుర్‌ను శ్రీశైలం దేవస్థానం మాజీ ట్రస్టీ చింతా శంకరమూర్తి, చింతా అత్తిలింగం, సొసైటీ మాజీ అధ్యక్షుడు పత్సల వరదరాజులు చేనేత వస్త్రాలతో సత్కరించారు. చేనేత పరిశ్రమ అభివృద్ధికి చేస్తానని ఎంపీ హామీ ఇచ్చారు.

ముమ్మిడివరంలో క్షుద్ర పూజల కలకలం





కాగితంపై పిల్లలు బొమ్మలు గీసి పసుపు, కుంకుమ రాసిన దృశ్యం

దుస్తులపై పసుపు, కుంకుమ వేసిన దృశ్యం

ముమ్మిడివరం, జూలై 9: ముమ్మిడివరం నగర పంచాయతీ బళ్లగేటు సెంటర్లోని పోలీసు క్వార్టర్స్ వెనుక ఉన్న ఒక నివాస గృహంలో 15రోజులుగా క్షుద్ర పూజలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. తమ పిల్లల చిత్రపటాలను కాగితాలపై గీసి పూజలు చేసి పసుపు, కుంకుమ పొట్లాలుగా కట్టి ఇంటి గుమ్మాల ముందు వేస్తున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ పిల్లలపై చేతబడి వంటివి చేస్తున్నారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సదరు ఇంటి చుట్టుపక్కలవారు సాయంత్రం దాటితే ఇళ్ల నుంచి బయటకు రావడానికి భయపడుతున్నారు. ముగ్గులు, నిమ్మకాయలు, పసుపు, కుంకుమలతో పిల్లల ఆకారంలో ఉన్న బొమ్మలను, పిల్లలు వేసుకునే దుస్తులను ఎత్తుకువెళ్లివాటికి పసుపు, కుంకుమ పూసి తిరిగి వాటిని వారి ఇళ్ల వద్ద వేస్తున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేస్తే తమపై క్షుద్రపూజలు ప్రయోగం చేస్తారేమో అని భయంగా ఉందంటున్నారు. దీనిపై స్థానికులు కొందరు పోలీసులకు సమాచారం అందించడంతో ముమ్మిడివరం ఎస్‌ఐ డి.సురేష్‌బాబు ఆ వ్యక్తిని స్టేషన్‌కు పిలిపించి విచారించారు. తాను ఇంట్లోదైవ పూజలు మాత్రమే చేసుకుంటున్నానని, గిట్టని వారు ఈ రకమైన ప్రచారం చేస్తున్నారన్నాడు. తనను ఇల్లు ఖాళీ చేయమని ఒత్తిడి చేస్తున్నారని, ఖాళీ చేయకపోవడంతో ఈరకమైన దుష్ప్రచారం చేశారని ఆ వ్యక్తి తెలిపినట్టు సమాచారం. కాగా ఇటువంటి ఆరోపణలతో అతడు ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోయినట్టు తెలిసింది.

రామేశ్వరం మొగ శాశ్వత పరిష్కారానికి చర్యలు: కలెక్టర్



అల్లవరం మండలం రామేశ్వరం తీరంలో మొగను పరిశీలిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అల్లవరం, జూలై 9: జిల్లాలోని అల్లవరం మండలం రామేశ్వరం, కూనవరం మొగల్లో ఇసుక మేటలపై జలవనరుల నిపుణుల కమిటీ నివేదిక అధ్యయనం చేసి శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వానికి నివేదిస్తామని కలెక్టర్ రావిరాల మహేష్‌కుమార్ అన్నారు.మంగళవారం ఆయన అధికారులు, ప్రజా ప్రతినిధులతో ట్రాక్టరుపై వెళ్లి రామేశ్వరం మొగను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈమొగలో రాళ్లతో గోడలు నిర్మిస్తే వేలాది ఎకరాలకు ముంపు నుంచి రక్షణ వచ్చి ఇసుక మేటల బెడద తప్పుతుందన్నారు. ప్రతిఏటా మొగలో ఇసుక మేట వేసి వేలాది ఎకరాలు ముంపునకు గురై నష్టం వాటిల్లుతోందని ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబురాజు కలెక్టర్‌కు వివరించారు. డ్రెయిన్లలో వలకట్లు లేకుండా చూడాలని, చల్లపల్లి-వాసలతిప్ప వెళ్లే రోడ్డును అభివృద్ధిచేయాలని పలువురు కలెక్టర్‌ను కోరారు. ఇరిగేషన్, డ్రైనేజీ అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామన్నారు. పర్యటనలో డ్రెయిన్స్ డీఈఈ ఎంవీవీ కిషోర్, ఏఈ పి.సునీత, ఎంపీడీవో కృష్ణమోహన్, తహసీల్దారు సునీల్‌కుమార్, సర్పంచ్ రాకాపు విజయలక్ష్మి, ఎంపీటీసీలు పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, ఎం.శ్రీనివాస్, నాయకులు రుద్రరాజు కాశీరాజు, కేవీ, కడలి విజయ్, లింగం శ్రీనివాస్, కటికిరెడ్డి బాబి, నల్లా రాము, ఈవోపీఆర్డీ ఎస్వీవీ సత్యనారాయణపాల్గొన్నారు.

ఏటిగట్టును పరిశీలించిన కలెక్టర్

రాజోలు, జూలై 9: రాజోలులో ఏటిగట్టు ప్రాంతాన్ని కలెక్టర్ రావిరాల మహేష్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. రాజోలు మేకలపాలెంలో గోదావరి ఏటిగట్టు ఎత్తు తక్కువగా ఉన్నచోట 2022లో వరదనీరు గట్టుపై ప్రవహించిన ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. ఏటిగట్టు ఎత్తు తక్కువగా ఉన్నందున వరద నీరు బయటికి వస్తుందని హెడ్‌వర్క్స్ డీఈఈ జి.శ్రీనివాస్ కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై అంచనాలు తయారు చేయాలని కలెక్టర్ సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ ఎం.గోపాలకృష్ణ, హెడ్ వర్క్స్ ఏఈఈ టి.మూర్తి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ప్రైవేటు రంగంలో ఉద్యోగావకాశాలు ఎక్కువ: జేసీ

అమలాపురం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు రంగంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, వాటిని యువత అందిపుచ్చుకోవాలని జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్‌అజయ్ సూచించారు. వికాస ఆధ్వర్యంలో పలు కంపెనీల ప్రతినిధులతో మంగళవారం కలెక్టరేట్‌లో జాబ్‌మేళా నిర్వహించారు. ఈసందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రస్తుత మార్కెట్ అవసరాలకు తగ్గట్టుగా యువత నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. అందరికీ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు వికాస సంస్థ కీలక భూమిక పోషిస్తోం దన్నారు. పదో తరగతి, ఆపై ఉన్నత విద్యాభ్యాసం చేసిన యువత కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకునేలా ఉచిత శిక్షణ ఇచ్చి ఆయా కంపెనీలకు అవసరమైన ఉద్యోగాలకు ఎంపిక చేయాలని సూచించారు. ఆధునిక కాలంలో నైపుణ్య ఆధారిత విద్యే ప్రధానమన్నారు. ప్రైవేటు సెక్టార్‌లో కష్టపడి అంకితభావంతో పనిచేసే వారికి మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. భాషా పరిజ్ఞానం, భావవ్యక్తీకరణ, కనీసం కంప్యూటర్ పరిజ్ఞానం లేకపోతే ఏ సంస్థా ఉద్యోగంలోకి తీసుకోదని గుర్తించాలన్నారు. జాబ్ మేళాను జేసీతో పాటు వీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు. వికాస జిల్లా మేనేజరు జి.రమేష్, వివిధ కంపెనీల మానవవనరుల విభాగాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



వికాసలో జాబ్ మేళాను పరిశీలిస్తున్న జేసీ నుపూర్‌అజయ్

మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడికి సత్కారం



కె.గంగవరం, జూలై 9: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రైస్‌మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన చుండ్రు వీవీఎస్ఎస్ చౌదరిని టీడీపీ మండల నాయకులు మంగళవారం ఘనంగా సత్కరించారు. యండగండిలోని ఆయన నివాసంలో చౌదరికి శాలువాకప్పి గజమాలతో సత్కరించారు. చౌదరిని అభినందించిన వారిలో టీడీపీ నాయకులు రావిపాటి వెంకట గణేష్ చౌదరి, మరివాడ చిన్నికృష్ణ, వెంటూరు వీర్రాఘవులుచౌదరి, గొడవర్తి రామకృష్ణ, నిడదవోలు సుబ్రహ్మణ్యం, వాసంశెట్టి కృష్ణ, గన్ని శ్రీనివాసు, మేడిశెట్టి రవికుమార్, సలాది రమేష్, జగతా రమణ, దంగేటి నాగేశ్వరరావు, మేడిశెట్టి పుణ్యమూర్తి, రవ్వా భూషణం, మొగమాటి చిట్టిరాజు, మాటూరి నాని ఉన్నారు.

కలెక్టర్‌ను కలిసిన నేతలు

అమలాపురంటౌన్, జూలై 9: కలెక్టర్ రావిరాల మహేష్‌కుమార్‌ను మంగళవారం పలువురు కలిశారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పెచ్చెట్టి చంద్రమౌళి, మీడియా కో-ఆర్డినేటర్ మంథా పణికుమార్, కూటమి నాయకులు మొయిల శివ, యిళ్ల రాము తదితరులు మర్యాదపూర్వకంగా కలుసుకుని సత్కరించి అభినందించారు.

ఉద్యోగులు బాధ్యతగా పని చేయండి: ఎమ్మెల్యే



పి.గన్నవరం, జూలై 9: ఉద్యోగులందరూ విధి నిర్వహణలో పని దొంగల్లా కాకుండా బాధ్యతో పని చేయండి, కార్యాలయాలకే పరిమితం కాకుండా ప్రజలకు నిత్యం అందుబాటులో లేకపోతే ఇబ్బందులు పడతారు, ఇక్కడ పనిచేయడం ఇష్టం లేకపోతే ముందే వెళ్లిపోవచ్చు... నిర్లక్ష్యం వహిస్తే సహించనని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ హెచ్చరించారు. పి.గన్నవరం సబ్‌డివిజన్ కార్యాలయంలో మంగళవారం అధి కారులతో ఆయన సమావేశం నిర్వహించారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. అధికారుల వద్దకు వచ్చే సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించాలని, ఇబ్బంది అయితే నా దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం ఇరిగేషన్, హెడ్‌వర్క్స్, డ్రైన్స్ విభాగాలకు సంబంధించి వారి పరిధిలో ఉన్న సమస్యలు, పనులను వారు ఎమ్మెల్యేకు వివరించారు. కార్యక్రమంలో గోదావరి సెంట్రల్ డివిజన్ ఏఈ బి.శ్రీనివాసరావు, హెడ్‌వర్క్స్ డీఈ జి.శ్రీనివాస్, ఇరిగేషన్ డీఈ కె.వెంకటేశ్వరరావు, డ్రెయిన్స్ డీఈఈ నాగార్జున, ఇరిగేషన్ ఏఈ సుందర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికపై గ్రామసభ తీర్మానం

అల్లవరం,జూలై9: బోడసకుర్రు పంచాయతీ పరిధిలో శ్మశానవాటిక లేక ఇబ్బందులు పడుతున్నామని గ్రామసభలో ప్రజలు ఆరోపించారు. సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి అధ్యక్షతన మంగళవారం జరిగిన గ్రామసభలో శ్మశానవాటికలకు స్థలాల కేటాయింపుపై తీర్మానించారు. అడపా వెంకటేశ్వరావు, ఓలేటి పరమేశ్వరరావు, ముత్యాల బాబీ, రోళ్ల శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి సింగంపల్లి దుర్గాశ్రీనివాస్‌పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి

అంబాజీపేట, జూలై9: విద్యాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషిచేస్తుందని టీడీపీ జిల్లా బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి యనమదల రాజబాబు అన్నారు. వక్కలంక ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు బ్యాగ్స్, నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. సర్పంచ్ వాసంశెట్టి రేవతి, టీడీపీ, జనసేన గ్రామ శాఖ అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసరావు, పితాని శ్రీనివాసరావు, పాఠశాల చైర్మన్ నాగాబత్తుల రాజేష్ పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

అంబాజీపేట, జూలై 9:పేదలకు మెరుగైన వైద్యసేవలందించాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమాన్ని మంగళవారం వైద్యాధికారి వి.గౌతమి అధ్యక్షతన నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు జరిగే విధంగా కృషిచేయాలని ఎమ్మెల్యే సూచించారు.జనసైనికులు సమకూర్చిన కిట్లను గర్భిణులు, బాలింతలకు అందించారు. పీహెచ్‌సీలో మౌలిక వసతులు లేవని వైద్యులు గౌతమి, శ్రీనివాసు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీంతో సొంత నగదు రూ.25వేలు ఎమ్మెల్యే అందిం చారు. ఎమ్మెల్యేను వైద్యులు, సిబ్బంది సత్కరించారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, ఎంపీడీవో సరోవర్, తహసీల్దార్ విమలకుమారి, నాయకులు గణపతి వీరరాఘవులు, బొంతు పెదబాబు, మైపాల తాతాజీ, కొర్లపాటి గోపి పాల్గొన్నారు.

వారాహి షోడశ రాత్రి పూజా మహోత్సవాలు



అమలాపురం టౌన్, జూలై 9: విద్యుత్ నగర్‌లోని ఆదిశేషా నిలయంలో వారాహి షోడశరాత్రి పూజా మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. ధర్మ సంరక్షణలో భాగంగా 3890వ దివ్యజ్ఞాన మోక్ష హోమం నిర్వహిస్తున్నట్టు ఏర్పేడు వ్యాసాశ్రమ పీఠాధిపతి శ్రీపరిపూర్ణానందగిరిస్వామి తెలిపారు. ఏకాదశ భైరవ దిగ్బంధనంలో భైరవ స్వరూప మంత్ర దండాలను హోమ గుండం చుట్టూ ప్రతిష్ఠించారు. యమధర్మరాజ, ధూమ్ర శనైశ్చర, దక్షిణామూర్తి, మహామృత్యుంజయ, త్రయంబకేశ్వర మంత్రాహుతులను సమర్పించారు. తొలుత వారాహి మాతకు పరిపూర్ణానందగిరిస్వామి ప్రత్యేక పూజలు నిర్వహించి హోమ క్రతువు జరిపించారు. బుధవారం అర్ధరాత్రి మహాపూర్ణాహుతి జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. సలాది సాయిరామ్, గారపాటి ఓంప్రకాష్, పెద్దిరెడ్డి వెంకటదుర్గేష్ రూ.10వేలు చొప్పున విరాళాలు అందించారు.

కుమ్మరి శాలివాహన సంక్షేమ సంఘ అధ్యక్షుడిగా రాయపూడి

అంబాజీపేట, జూలై 9: మాచవరంలోని కుమ్మరి శాలివాహన సంఘ భవనంలో కోనసీమ సంఘ సభ్యుల సమావేశం మంగళవారం ఉపాధ్యక్షుడు మండ వీరభద్రరావు అధ్యక్షతన జరిగింది. సంఘ అధ్యక్షుడిగా రాయపూడి వెంకటేశ్వరరావు, గౌరవ అధ్యక్షుడిగా చిరతపూడి వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా ర్యాలి భాస్కరరావు, కోశాధికారిగా దేవగుప్తాపు ఏసుదాసు, ఉపాధ్యక్షుడిగా మానేపల్లి నాగరాజు, సహాయ కార్యదర్శులుగా చిరతపూడి దుర్గాప్రసాద్, ముద్రగడ శివ, ఆర్గనైజర్‌గా ర్యాలి భద్రకిరణ్‌తో పాటు పలువురు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన సభ్యులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మానేపల్లి వీరబ్రహ్మం, దాలిపర్తి భీమేశ్వరారవు, అంబటి సుబ్రహ్మణ్యం, ఆదుర్తి నారాయణమూర్తి, శ్రీనివాసవడయార్, మంతెన శ్రీనివాస్, వెల్ల త్రిమూర్తులు, శేషగిరి పాల్గొన్నారు.

వీరేశ్వరస్వామికి రూ.10వేలు విరాళం

ఐ.పోలవరం, జూలై 9: మురమళ్ల శ్రీవీరేశ్వరస్వామి నిత్యాన్నదాన పథకానికి ముమ్మిడివరానికి చెందిన నలమాటి ఏడుకొండలు దంపతులు మంగళవారం రూ.10 వేలు విరాళాన్ని ఆలయ పర్యవేక్షణాధికారి బీ.వీరభద్రరావుకు అందజేశారు. దాతకు స్వామివారి చిత్రపటం అందించారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: --
వెంకటరమణ	: కల్కి 2898 ఏడీ
శ్రీలలిత	: మహారాజ
శేఖర్ స్క్రీన్-1	: కల్కి 2898 ఏడీ
శేఖర్ స్క్రీన్-2	: కల్కి 2898 ఏడీ
రమా	: ప్రభుత్వ జూనియర్ కళాశాల
గణపతి	: హరోం హర
వెంకటపద్మావతిస్క్రీన్-1	: కల్కి 2898
వెంకటపద్మావతి స్క్రీన్-2	: కల్కి 2898 ఏడీ

ఉచిత ఇసుకతో బడుగు, బలహీన వర్గాల ప్రగతి

పి.గన్నవరం, జూలై 9: రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఉచితంగా ఇసుక ఇస్తూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి బాట వేసిందని టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ నామన రాంబాబు అన్నారు. పి.గన్నవరం కూటమి కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబుతో కలిసి ఆయన మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలో పేదలు ఇల్లుకట్టుకోవడానికి రూ.5లక్షలు ఖర్చయితే అందులో ఇసుక కొనుగోలుకు రూ.3లక్షలు ఖర్చయ్యేదన్నారు. సుప్రీం కోర్టు, హైకోర్టు, ఎన్జీటీ నిబంధనలు అనుగుణంగా పర్యావరణం దెబ్బతినకుండా కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుకను అందిస్తుందన్నారు.మద్దాల సుబ్రహ్మణ్యం, సంసాని పెద్దిరాజు, నేదునూరు వీర్రాజు, చిట్టూరి శ్రీనివాస్, తోలేటి సత్తిబాబు, మొల్లేటి శ్రీనివాస్, అంబటి భూలక్ష్మి, శేరు శ్రీనుబాబు, గుత్తుల రామకృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు అందించిన పూర్వ విద్యార్థులు

మామిడికుదురు, జూలై 9: మామిడికుదురు జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతోన్న 200మంది విద్యార్థులకు భోజన ప్లేట్లను 1989-90బ్యాచ్ పూర్వ విద్యార్థులు అందించారు. పూర్వ విద్యార్థులను హెచ్‌ఎం నిరంజని, ఉపాధ్యాయులు అభినందించారు. విద్యాభివృద్ధికి పూర్వ విద్యార్థులు అందిస్తున్న సహకారం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు అల్లూరి సత్య కిశోర్‌వర్మ, కామిశెట్టి సుబ్రహ్మణ్యం, నయినాల ఎన్వీ ప్రసాద్, ఉపాధ్యాయులు రమేష్‌బాబు, మట్టా శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కౌలురైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

మామిడికుదురు, జూలై 9: గ్రామ సభలు నిర్వహించి కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కౌలు రైతు సంఘ రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు డిమాండు చేశారు. స్థానిక అంబేడ్కర్ సామాజిక భవనంలో జిల్లా అధ్యక్షుడు అప్పారి వెంకటేశ్వరరావు అధ్యక్షతన మంగళవారం ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘ సమావేశం జరిగింది. రాష్ట్ర కార్యదర్శి మాట్లాడుతూ కౌలు ధ్రువపత్రాలపై భూ యజమాని సంతకం తొలగించాలని డిమాండు చేశారు. రాష్ట్రంలో కౌలు రైతుల సంఖ్య క్రమేణా పెరుగుతుందని, నూటికి 70శాతం మంది కౌలు రైతులే సాగు చేస్తున్నారన్నారు. అధిక, అకాల వర్షాలు, తుఫానులు ప్రతీ సంవత్సరం పంటలను పాడు చేస్తున్నాయని, రైతులకు ఉపయోగపడే విధంగా కాల్వలు, డ్రెయిన్లను ప్రభుత్వం బాగు చేయించాలన్నారు. సీసీఆర్సీ చట్టాన్ని రద్దుచేసి 2011ఎల్‌సీ చట్టాన్ని అమలుచేసి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 40లక్షల కౌలు రైతుల కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. బి.బలరామ్, ఆండ్ర మాల్యాద్రి, పీతల రామచంద్రరావు, ఈలి శ్రీనివాసరావు, తాటికాయల ఉదయభాస్కరరావు, పెచ్చెట్టి ఉదయభాస్కరరావు, తాడి శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

సమగ్ర శిక్షా ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలి

ద్రాక్షారామ, జూలై 9: సమగ్ర శిక్షాలో పని చేస్తోన్న తమకు రెండు నెలల వేతన బకాయిలు, సమ్మెకాల వేతనం చెల్లించాలని సమగ్ర శిక్షా కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ సీహెచ్ వెంకన్నబాబు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. చాలీచాలని వేతనాలతో కుటుంబాలను పోషించుకుంటున్నామన్నారు. రెండు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో కుటుంబపోషణ కష్టతరంగా మారి ఇబ్బందులు పడుతున్నామన్నారు. గత ప్రభుత్వం సమ్మెకాల వేతనం, మినిట్స్ అమలు చేయలేదన్నారు. కూటమి ప్రభుత్వం వేతనాలు చెల్లించి న్యాయం చేయాలని కోరారు. బుధవారం భోజన విరామ సమయంలో జిల్లా, మండల కేంద్రాల్లో నిరసన తెలపాలని పిలుపునిచ్చారు. ప్రతినెలా ఒకటో తేదీన సీఎఫ్ఎంఎస్ ద్వారా వేతనాలు చెల్లించాలని, అన్ని విభాగాల ఉద్యోగుల సర్వీసు క్రమబద్ధీకరించే అంశాన్ని పరిశీలించాలన్నారు.

కూటమి నేతలకు సన్మానం

పి.గన్నవరం,జూలై9: పి.గన్నవరం మండల టెంట్‌హౌస్, లైటింగ్ యూనియన్ సభ్యులు మంగళవారం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, నియోజకవర్గ టీడీపీ కోఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ నామన రాంబాబు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కానాథ్‌బాబులను దుశ్శాలువాతో సన్మానించారు. యూనియన్ అభివృద్ధికి సహకారం అందిస్తానని ఎమ్మెల్యే హామీఇచ్చారు. యూనియన్ అధ్యక్షుడు అడబాల రామకృష్ణ, కార్యదర్శి బండారు శ్రీను, ఉపాధ్యక్షుడు కుసుమ నాగేశ్వరరావు, ట్రెజరర్ కుడిపూడి దుర్గానాగరాజు, నాయకులు సంసాని పెద్దిరాజు, వాసంశెట్టి కుమార్, తోలేటి సత్తిబాబు, శేరు శ్రీనుబాబు పాల్గొన్నారు.

శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడిగా శ్రీధర్



శెట్టిబలిజ సంఘం కార్యవర్గం

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూలై 9: రామచంద్రపురం తాలూకా శెట్టిబలిజ సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలో శెట్టిబలిజ కల్యాణ మండపంలో తాలూకా శెట్టిబలిజ సంఘం సర్వసభ్యసమావేశం జరిగింది. సంఘ అభివృద్ధి, వివిధ అంశాలపై చర్చించారు. అనంతరం కాజులూరు, కె.గంగవరం, రామచంద్రపురం మండలం, పట్టణం శెట్టిబలిజ సంఘాల కార్యవర్గసభ్యులు తాలూకా శెట్టిబలిజ సంఘం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వేగాయమ్మపేట గ్రామానికి చెందిన దొంగల శ్రీధర్, ఉపాధ్యక్షులుగా పంపన శ్రీనివాస్, పెంకే విశ్వేశ్వరరావు, కార్యదర్శిగా కోట శ్రీనివాసరావు, ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

14న బీఎస్సీ నర్సింగ్ ప్రవేశపరీక్ష

యానాం, జూలై 9: పుదుచ్చేరిలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో 2024-25 ఏడాదికి సీట్ల భర్తీకి బీఎస్సీ నర్సింగ్ కోర్సుకు ప్రవేశ పరీక్షను పుదుచ్చేరి ప్రభుత్వం తొలిసారిగా నిర్వహిస్తుంది. ఈనెల14వ తేదీ ఆదివారం పుదుచ్చేరి, కారైకాల్, మాహే, యానాం రీజియన్లలో ఈపరీక్షను నిర్వహించనున్నారు. ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు బుధవారం నుంచి సెంటాక్ వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు.

మెరిట్ జాబితా విడుదల

యానాం, జూలై 9: బ్యాచలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ (బీఆర్క్) డిగ్రీ కోర్సు అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల మెరిట్ జాబితాను విడుదల చేసినట్లు సెంటాక్ కోఆర్డినేటర్ అమన్‌శర్మ తెలిపారు. వివరాలకు సెంటాక్ వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు. అభ్యర్థుల దరఖాస్తుల వెరిఫికేషన్ స్టేటస్‌ను అందుబాటులో ఉంచామన్నారు.

కార్మికుల సమస్యలపై చర్చలు

యానాం,జూలై9: యానాం నియోజకవర్గ పరిధిలోని సెల్లమ్ ఫార్మాషూటికల్స్ పరిశ్రమలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై పరిశ్రమ యాజమాన్యంతో చర్చించినట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దుర్గాప్రసాద్ తెలిపారు. మహిళా కార్మికుల ఏకపక్ష తొలగింపుపై చర్చించామన్నారు. దీనిపై పరిశ్రమ ఎండీ మూర్తి సమస్యలపై సానుకులంగా స్పందించారన్నారు.

కనకమహాలక్ష్మి సేవలో కూటమి నాయకులు

అల్లవరం,జూలై9: అమ్మవారితీర్థమహోత్సవాల్లో భాగంగా కొమరగిరిపట్నం గ్రామదేవత కనకమహాలక్ష్మిని కూటమి నేతలు దర్శించుకున్నారు. టీడీపీ రాష్ట్ర నాయకులు మెట్ల రమణబాబు, అల్లాడి స్వామినాయుడు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు, బొర్రా ఈశ్వరరావు, ముత్యాల రామకృష్ణ, గునిశెట్టి రోహిణికుమార్, వైస్ ఎంపీపీ ముత్యాల రామకృష్ణ, కంకిపాటి వీరబాబు, చిక్కాల సతీష్, గుర్రం కృష్ణ, కటికిరెడ్డి బాబి, నల్లా రాము పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా సమస్యను పరిష్కరించుకున్నారు

మామిడికుదురు, జూలై 9: నగరంలోని బడే బీబీ పంజా వద్ద వర్షం వస్తే నీరు చేరి రోడ్డు మునిగిపోతుంది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం స్థానికులు స్వచ్ఛందంగా వర్షం నీరు బయటకి పోయేలా మ్యాన్‌హోల్ ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో నూరేన్ అబ్బాస్, అక్బర్ అలీ, గుల్షన్ అబ్బాస్, తల్బీజ్ అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

12న ఉద్యోగ మేళా

ముమ్మిడివరం, జూలై 9: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల12న రావులపాలెంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.లోకమాన్ తెలిపారు. గోపాలపురంలోని అవంతి ఫుడ్స్ కంపెనీలో 90కుపైగా ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. పదోతరగతి, డిప్లొమా, ఐటీఐ, ఏదైనా డిగ్రీ పాస్ లేదా ఫెయిల్ అయిన వారు కూడా అర్హులన్నారు. బయోడేటా, అడ్రస్ ప్రూఫ్, ఐడీ,పాస్‌పోర్టు సైజుఫొటోలు, విద్యార్హత సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి 15రోజులు శిక్షణ ఇస్తారన్నారు. వివరాలకు రాజేంద్ర(8247645389)ను సంప్రదించాలన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

ఆత్రేయపురం, జూలై 9: ర్యాలి శివారు బుల్లియ్యరేవు ప్రాథమిక పాఠశాల చిన్నారులకు ఉపాధ్యాయుడు సుధాకర్‌బాబు నోటు పుస్తకాలు సమకూర్చారు. హెచ్‌ఎం సత్తిబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఎంఈవో ప్రసాదరావు ముఖ్య అతిథిగా హాజరై నోటు పుస్తకాలు, స్టేషనరీ పంపిణీ చేశారు.

ఎన్నికల విధానం లోపభూయిష్టం

అమలాపురంటౌన్, జూలై9: దేశంలో ఎన్నికల విధానం లోపభూయిష్టంగా ఉందని ఆర్పీఐ రాష్ట్ర అధ్యక్షుడు డీబీ లోక్ పేర్కొన్నారు. దామాషా పద్ధతిన ఎన్నికలు జరిపించి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని డిమాండు చేశారు. సూర్యనగర్‌లో మంగళవారం జరిగిన ఆర్పీఐ కార్యకర్తల సమావేశంలో ఉండ్రు శ్యామలరావు, ఎలిపే సత్యనారాయణ,పండు రాజేష్, కె.రామకృష్ణ పాల్గొన్నారు.

సర్వే ఉద్యోగుల సంఘం ఆవిర్భావ దినోత్సవం

ముమ్మిడివరం, జూలై 9: సర్వే ఉద్యోగుల సంఘం ఆవిర్భావ దినోత్సవాన్ని ముమ్మిడివరంలోని ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాలలో గల జిల్లా సర్వే కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు జి.పట్టాభిరామయ్య చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. సర్వే ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఆయన అందించిన సేవలను, చేసిన పోరాటాలను కొనియాడారు. విధి నిర్వహణలో సర్వే ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాసరి సాయిబాబా, జిల్లా అధ్యక్షుడు కె.ప్రభాకరరావు, ఏపీఎస్ఈఏ ఉపాధ్యక్షులు ఇ.రామకృష్ణ, ఎం.శ్రీహర్ష, జె.చాందినీదేవి, బి.ఉమాశంకర్, పి.శ్రీరామ్, ఇ.సూర్యతేజ, కె.బాలవెంకట్, ఎస్.తేజ, పీఐవోఎస్, జిల్లా కార్యవర్గం, తాలూకా కార్యవర్గం, మండల, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టరు స్వాధీనం

పి.గన్నవరం, జూలై9: లంకలగన్నవరంలోనిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సోమవారంరాత్రి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ బి.శివకృష్ణ తెలిపారు. ఇసుకను ఏప్రాంతంలో తవ్వకాలు జరిపారో విచారణ చేస్తున్నామని, చర్యలకు తహశీల్దార్ కార్యాలయానికి సిఫార్సు చేశామన్నారు.

వివాహితపై అత్యాచారయత్నం

ఆత్రేయపురం, జూలై 9: ఒక గ్రామంలో 20ఏళ్ల వివాహితపై ఆమె ఇంటి సమీపంలో ఉన్న శివ అనే యువకుడు ఈనెల8వతేదీ తెల్లవారుజామున అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. ఆ మహిళ కేకలు వేయగా భర్త రావడంతో యువకుడు అక్కడి నుంచి పరారయ్యాడు. మనస్థాపానికి గురైన మహిళ చెదల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆసుపత్రి నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

ఆత్రేయపురం,జూలై9: ర్యాలిగ్రామానికి చెందిన 24ఏళ్ల యువతి సోమవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లింది. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. తండ్రి రేలంగి సూరిబాబు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ శ్రీనివాస్ చెప్పారు.